మానేరు
# జనత ®
తెలుగు దినపత్రిక ఇది జనం గొంతుక

13.3.2026 శుక్రవారం Friday | సంపుటి (Volume): 10 సంచిక (Issue) : 323 | పేజీలు : 8 Pages : 8 | వెల : 2 | Published from : Karimnagar

## భారత క్రికెట్ జట్టు మెగా షెడ్యూల్



సమస్య ఏదైనా జనం కోసం జనతా..
ఇదే మా ఆహ్వానం
ప్రజలు, ప్రభుత్వానికి మధ్య వారధి మీడియా
ప్రజా సమస్యలను వెలికితీసి..
వాటి పరిష్కారానికి పునాది వేసేది మీడియా
మీ సమస్య ఏదైనా మీ తరుపున నిలబడి
అటు అధికారులను గానీ,ఇటు రాజకీయ నాయకులను గానీ
నిలదీస్తూ, నిజాన్ని నిగ్గు తేలుస్తుంది జనతా..
రండి..మీ కలాన్ని కదపండి..
మీ గళాన్ని వినిపించండి.
అందరం కలిసికట్టుగా..
"జనతా"తో కలిసి ప్రజా సమస్యలపై పోరాడుదాం..!!
మొక్కవోని దీక్షతో పని చేద్దాం.. తగ్గేదేలే..!
జనం కోసం "జనతా"..

శుభాకాంక్షలు..
సంప్రదించాల్సిన మొబైల్ నంబర్.. 7989867251
- ఎడిటర్

## హైదరాబాద్‌లో నెట్‌ఫ్లిక్స్ స్టూడియో

- ప్రారంభించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- హైదరాబాద్‌కు నెట్‌ఫ్లిక్స్ రావడం అంటే సాక్షాత్తు హాలీవుడ్ ఇక్కడికి వచ్చినట్టే అన్న సీఎం
- నెట్‌ఫ్లిక్స్‌కు ప్రభుత్వం అన్ని విధాలా సహకరిస్తుందని హామీ
- ఫ్యూచర్‌సిటిలో ఏర్పాటుకు భూమి కేటాయిస్తామని ప్రకటన

02



## దేశంలో ఇంధన కొరత లేదు

### తగినన్ని క్రూడాయిల్ నిల్వలు ఉన్నాయి

- రిఫనరీలు పూర్తి స్థాయిలో పనిచేస్తున్నాయి
- ఎలాంటి సంక్షోభాన్ని అయినా ఎదుర్కొంటాం
- లోక్‌సభలో కేంద్రమంత్రి హర్దీప్ పురి సింగ్ ప్రకటన
- మంత్రిని హేళన చేస్తూ ఎన్‌స్టీన్ ఫైళ్ల ప్రస్తావనతో గందరగోళం



## త్రీ ట్రిలియన్ డాలర్ ఎకానమీ సాధించడమే లక్ష్యం

### లక్ష్యసాధనలో సాధనలో పోలీస్ శాఖ పాత్ర కీలకం



- పోలీస్ శాఖలో దశలవారీగా ఎలక్ట్రిక్ వాహనాలు వినియోగం
- రాష్ట్ర సమగ్ర అభివృద్ధి కి రూరల్ అగ్రి రీజియన్ పై దృష్టి
- ప్రీ బడ్జెట్ సమావేశాల్లో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

**జనతా న్యూస్, హైదరాబాద్:** 2047 నాటికి త్రీ ట్రిలియన్ డాలర్ ఎకానమీ సాధించడమే లక్ష్యంగా రాష్ట్రం ముందుకు పోతున్న క్రమంలో ఈ లక్ష్యసాధనలో పోలీస్ శాఖ పాత్ర కీలకమని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. గురువారం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సచివాలయంలో మొదట హోంశాఖ తదుపరి మంత్రి దుదిల్ల శ్రీధర్ బాబుతో కలిసి పరిశ్రమలు, ఐటీ శాఖల ప్రీ బడ్జెట్ సమావేశంలో డిప్యూటీ సీఎం పలు సూచనలు చేశారు. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు పెద్ద సంఖ్యలో పెట్టుబడిదారులు వస్తున్న నేపథ్యంలో శాంతిభద్రతలు కీలకం అన్నారు. ఈ అంశంలో ఏ చిన్న పొరపాటుకు హోంశాఖ అధికారులు, సిబ్బంది అవకాశం ఇవ్వరాదని, ప్రతి కదలిక మీ కనుసన్నల్లో ఉండాలని సూచించారు. విధుల నిర్వహణ క్రమంలో హోంశాఖకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి పూర్తి సహాయ సహకారాలు ఉంటాయని తెలిపారు. హైదరాబాద్ నగరం

మిగతా 2 లో

## మన విదేశాంగ విధానం అమెరికాకు తాకట్టు

### ఎవరి నుంచి చమురు కొనాలో అమెరికా పెత్తనం ఏంటి

- ఎన్‌స్టీన్ ఫైల్స్‌లో దొరికి పోవడంతోనే అమెరికాకు దాసోహం
- లోక్‌సభలో రాహుల్ గాంధీ ఘాటు విమర్శలు




## గ్యాస్ కొరతపై కేంద్రం జోక్యం చేసుకోవాలి

### ఎల్పీజీ సిలిండర్ల కొరతపై కేంద్రానికి కేటీఆర్ లేఖ



03

- హోటళ్లు, హాస్టళ్లు మూతపడే ప్రమాదమని హెచ్చరిక
- చిన్న వ్యాపారులకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచన
- బ్లాక్ మార్కెట్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్
- గ్యాస్ ఆధారిత శ్మశాన వాటికలను అత్యవసర సేవలుగా గుర్తించాలని విజ్ఞప్తి

దేశంలో వాణిజ్య, గృహ వినియోగ ఎల్పీజీ సిలిండర్ల తీవ్ర కొరత ఏర్పడిందని, ఈ సంక్షోభాన్ని పరిష్కరించేందుకు తక్షణమే జోక్యం చేసుకోవాలని బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు ఆయన గురువారం కేంద్ర పెట్రోలియం, సహజవాయువు శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పూరీకి లేఖ రాశారు.



02

## ఫిరాయింపు ఎమ్మెల్యేల కేసు క్లోజ్

### స్పీకర్ నిర్ణయంతో ఏకీభవించిన సుప్రీం

### తదుపరి విచారణ అవసరం లేదని వ్యాఖ్య

తెలంగాణలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేల పార్టీ ఫిరాయింపు కేసు విచారణ ఎట్టకేలకు ముగిసింది. రాష్ట్ర రాజకీయాల్లో కొన్నిరోజులుగా తీవ్ర కలకలం రేపిన ఈ కేసు విచారణను గురువారం నాడు సుప్రీంకోర్టు ముగించింది.



04

## యుద్ధ సంక్షోభంలో భారత్ తొలి విజయం

- హర్మూజ్ జలసంధి నుంచి భారత్‌కు చమురు నౌక
- క్షేమంగా ముంబై తీరం చేరుకున్నషెన్‌లాంగ్
- ఇరాన్ పరోక్ష మద్దతుతో తొలి నౌక రాక



## 14 నుంచి పదో తరగతి పరీక్షలు

- అన్ని ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు
- సకాలంలో సెంటర్లకు చేరుకోవాలని సూచన
- ఐదు నిముషాల ఆలస్యానికి అనుమతి

.. వివరాలు 2లో



## 16నుంచి ఒంటిపూట బడులు

### ఉత్తర్వులు జారీచేసిన విద్యాశాఖ

.. వివరాలు 2లో



# త్రీ ట్రిలియన్ డాలర్ ఎకానమీ సాధించడమే లక్ష్యం

మొదటి పేజీ తరువాయి

ప్రపంచంలో మేటి నగరంగా ఎదుగుతున్న క్రమంలో వేగంగా పలు సంస్కరణలు చేపడుతున్నామని ఇందులో భాగంగా పోలీస్ శాఖలో దశలవారీగా ఎలక్ట్రిక్ వాహనాల వినియోగాన్ని పెంచాలని సూచించారు. అదేవిధంగా నేర నియంత్రణలో సీసీ కెమెరాల పాత్ర గణనీయంగా ఉంటుంది ఈ నేపథ్యంలో రాష్ట్రంలో సీసీ కెమెరాల వినియోగాన్ని పెద్ద సంఖ్యలో చేపట్టాలని, అవసరమైన చోట మరమ్మతులు చేపట్టాలని చిన్న కదలికను సైతం వేను వెంటనే గుర్తించి నిఘాను పటిష్టం చేసేందుకు సీసీ కెమెరాల వినియోగాన్ని పెంచాలని అందుకు అవసరమైన సహకారాన్ని రాష్ట్ర ప్రభుత్వం అందిస్తుందని తెలిపారు. 2047 త్రీ ట్రిలియన్ డాలర్ ఎకానమీగా లక్ష సాధనలో పబ్లిక్, ప్రైవేట్ మోడల్ అనివార్యమని ఆ విధంగా ప్రణాళికలు సిద్ధం చేసుకుని ముందుకు వెళ్లాలని పరిశ్రమల శాఖ అధికారులకు డిప్యూటీ సీఎం సూచించారు. రాష్ట్ర సమగ్ర అభివృద్ధికి రూరల్ అగ్రి రీజియన్ ఎకానమీ సమ ప్రాధాన్యత ఇవ్వాలని డిప్యూటీ సీఎం సూచించారు. ఈ రంగంలో పెద్ద ఎత్తున పెట్టుబడులు, పరిశ్రమలు వచ్చే విధంగా ప్రణాళికలు సిద్ధం చేయాలని పరిశ్రమల శాఖ అధికారులను ఆదేశించారు. మైక్రో, స్మాల్, మీడియం ఇండస్ట్రీస్ లను పెద్ద ఎత్తున ప్రోత్సహించాలనేది ప్రజా ప్రభుత్వం ఆలోచన అని తెలిపారు. రాష్ట్ర నలుమూలలోని యువతకు పెద్ద సంఖ్యలో ఉపాధి తో పాటు పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దేందుకు అవకాశం ఉన్న రంగం అని తెలిపారు. జీసీసీలతో రాష్ట్రం దేశంలోనే ప్రథమ స్థానంలో ఉందని, ఇదే వేగాన్ని కొనసాగించేందుకు ప్రభుత్వ నుంచి ప్రోత్సాహం కల్పిస్తామని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుదిల్ల శ్రీధర్ బాబు అన్నారు. డాటా సెంటర్లలో ఎఐ వినియోగాన్నిపెద్ద ఎత్తున చేపట్టాలని మంత్రి శ్రీధర్ బాబుకు సూచించారు. సమావేశంలో చీఫ్ సెక్రటరీ రామకృష్ణారావు, ఆర్థిక శాఖ ప్రధాన కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, హోం శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ సివి ఆనంద్, శశాంక డిప్యూటీ సీఎం స్పెషల్ సెక్రటరీ కృష్ణ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

# ఫిరాయింపు ఎమ్మెల్యేల కేసు క్లోజ్

## స్పీకర్ నిర్ణయంతో ఏకీభవించిన సుప్రీం

## తదుపరి విచారణ అవసరం లేదని వ్యాఖ్య

**న్యూఢిల్లీ,మార్చి12 :** తెలంగాణలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేల పార్టీ ఫిరాయింపు కేసు విచారణ ఎట్టకేలకు ముగిసింది. రాష్ట్ర రాజకీయాల్లో కొన్నిరోజులుగా తీవ్ర కలకలం రేపిన ఈ కేసు విచారణను గురువారం నాడు సుప్రీంకోర్టు ముగించింది. పార్టీ ఫిరాయింపు ఎమ్మెల్యేలపై నిర్ణీత గడువులోగా నిర్ణయం తీసుకోవాలని చెప్పినా.. స్పీకర్ నిర్ణయం తీసుకోలేదని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు పాడి కౌశిక్ రెడ్డి, కేటీఆర్, బీజేపీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి కోర్టు ధిక్కార పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్ గురువారం విచారణకు రాగా విచారణ కొనసాగించాల్సిన అవసరం లేదని సుప్రీంకోర్టు తేల్చి చెప్పింది. పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలంటూ బీఆర్ఎస్ దాఖలు చేసిన పిటిషన్లపై సుదీర్ఘ విచారణ అనంతరం ఉన్నత న్యాయస్థానం తుది తీర్పు వెలువరించింది . ఈ కేసును జస్టిస్ సంజయ్ కరోల్, జస్టిస్ అగస్టిన్ జార్జ్ మసీహ్ నేతృత్వంలోని ధర్మాసనం విచారించగా.. స్పీకర్ తరపున సీనియర్ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వీ వాదనలు వినిపించారు. ఎమ్మెల్యేల అనర్హతకు సంబంధించి దాఖలైన పిటిషన్లపై తెలంగాణ స్పీకర్ ఇప్పటికే విచారణ జరిపి, తగిన నిర్ణయం తీసుకున్నారని ఆయన కోర్టుకు వివరించారు. దీంతో ఈ సమస్య సభాపతి కార్యాలయంలోనే ముగిసిందన్నారు. సింఘ్వీ వాదనలతో ఏకీభవించిన ధర్మాసనం.. ఈ వ్యవహారంపై స్పీకర్ ఇప్పటికే తుది నిర్ణయం తీసుకున్నందున విచారణ కొనసాగించాల్సిన అవసరం లేదని భావించింది. దీంతో కోర్టు విచారణ ముగిసినట్లేనని వెల్లడించింది. స్పీకర్ ఆదేశాలను రెండు రోజుల్లో అధికారికంగా ప్రచురించాలని న్యాయస్థానం ఆదేశించింది. ఆ తరువాత పిటిషనర్లకు కావాల్సిన డాక్యుమెంట్లను కూడా నాలుగు రోజుల్లో అందజేయాలని సూచించింది. దీంతో 10 మంది ఎమ్మెల్యేలకు సభాపతి క్లీన్ చిట్ ఇచ్చినట్లైంది. ఈ వ్యవహారంలో పదిమంది బిఆర్ఎస్ ఎమ్మెల్యేలకు ఊరట దక్కింది. అయితే పోరాడిన బిఆర్ఎస్‌కు మాత్రం న్యాయం దక్కలేదని ఆ పార్టీ నేతలు వ్యాఖ్యానించారు. స్పీకర్ తీర్పుపై ఇప్పటికే బిఆర్ఎస్ తన నిరసన తెలియచేసింది. స్పీకర్ తీర్పును సవాల్ చేస్తామన్న బిజెపికి కూడా ఈ తీర్పుతో ఇక అవకాశం లేనట్లుగానే భావించాలి.

# 14నుంచి పదోతరగతి పరీక్షలు

**హైదరాబాద్,మార్చి12 :** పదో తరగతి వార్షిక పరీక్షలు ఈ నెల 14 నుంచి ప్రారంభంకానున్నాయి. ఈ మేరకు అధికారులు సకల ఏర్పాట్లు పూర్తి చేశారు. పరీక్షలు శనివారం ప్రారంభమై.. ఏప్రిల్ 16వ తేదీ వరకు జరుగుతాయి. ఉదయం 9.30 గంటలకు పరీక్షలు ప్రారంభం అవుతాయి. సకాలంలో పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని అధికారులు సూచించారు. అయితే పరీక్షలకు ఐదు నిమిషాలు ఆలస్యంగా వచ్చే విద్యార్థులను అనుమతిస్తారు. ఆ తర్వాత వచ్చే వారిని అస్సలు అనుమతించబోరు. అంటే ఉదయం 9:35 గంటల తర్వాత వచ్చే విద్యార్థులను పరీక్షకు అనుమతించబోరు. విద్యార్థులు గంట ముందుగానే పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని అధికారులు సూచించారు. పరీక్షల నిర్వహణ కోసం రాష్ట్రవ్యాప్తంగా 2,676 సెంటర్లు ఏర్పాటు చేశారు. ప్రభుత్వ బడుల్లో 1,582 సెంటర్లు, ప్రైవేట్ బడుల్లో 1,094 సెంటర్లు ఏర్పాటు చేశారు. ఈ సారి 5,17,727 మంది విద్యార్థులు పరీక్షలు రాయబోతున్నారు. పరీక్షల సందర్భంగా సెల్‌ఫోన్ల వినియోగంపై అధికారులు కఠిన ఆంక్షలు విధించారు. పరీక్ష కేంద్రాలను 'నో సెల్‌ఫోన్' జోన్లుగా ప్రకటించారు. పరీక్ష సిబ్బంది, స్క్వాడ్ సహా ఇతర అధికారులందరికీ ఈ నిబంధనలు వర్తిస్తాయి. తనిఖీలకు వచ్చే అధికారులు సైతం సెల్‌ఫోన్లు తీసుకెళ్లరాదు. వీరు తమ సెల్‌ఫోన్లను గది బయటే పెట్టాల్సి ఉంటుంది. ఎవరొచ్చినా తనిఖీలు చేసిన తర్వాతే లోపలికి అనుమతిస్తారు. ఒకవేళ ఎవరైనా ఈ నిబంధనలు ఉల్లంఘించి సెల్‌ఫోన్లతో విధులకు హాజరైతే వారిని సస్పెండ్‌చేస్తారు. పేపర్ లీకేజీలకు పాల్పడితే ఉద్యోగం నుంచి తొలగిస్తారు. పరీక్షలు జరుగుతుండగానే మూల్యాంకనం కూడా ప్రారంభం అవుతుంది. ఈ నెల 14 నుంచి పదో తరగతి పరీక్షలు జరుగనుండగా, ఏప్రిల్ 1 నుంచి జవాబపత్రాల మూల్యాంకనం జరుగనున్నది.

# 16నుంచి ఒంటిపూట బడులు

**హైదరాబాద్,మార్చి12 :** తెలంగాణ రాష్ట్రంలో ఎండల తీవ్రత దృష్ట్యా పాఠశాల విద్యాశాఖ కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు మార్చి 16 నుంచి ఏప్రిల్ 23 వరకు ఒంటిపూట బడులు నిర్వహించనున్నట్లు అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది. ప్రతిరోజూ ఉదయం 8:00 గంటల నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు తరగతులు జరుగుతాయి. ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్నం 12:30 గంటలకు భోజనం వడ్డించిన తర్వాత విద్యార్థులను ఇంటికి పంపిస్తారు. టెన్త్ ఎగ్జామ్స్ జరిగే స్కూళ్లలో షెడ్యూల్ మారుతుంది. అక్కడ మధ్యాహ్నం 1:00 గంట నుంచి సాయంత్రం 5:00 గంటల వరకు ఒంటిపూట బడులు నిర్వహిస్తారు. పదో తరగతి విద్యార్థులకు పరీక్షల దృష్ట్యా యధావిధిగా ప్రత్యేక తరగతులు కొనసాగుతాయి.

# హైదరాబాద్‌లో నెట్‌ఫ్లిక్స్ స్టూడియో

**ప్రారంభించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి**

**హైదరాబాద్‌కు నెట్‌ఫ్లిక్స్ రావడం అంటే సాక్షాత్తు హాలీవుడ్ ఇక్కడికి వచ్చినట్టే అన్న సీఎం**

**నెట్‌ఫ్లిక్స్‌కు ప్రభుత్వం అన్ని విధాలా సహకరిస్తుందని హామీ**

**ఫ్యూచర్‌సిటిలో ఏర్పాటుకు భూమి కేటాయిస్తామని ప్రకటన**




**హైదరాబాద్,మార్చి12 :** నెట్‌ఫ్లిక్స్‌ను హైదరాబాద్‌కు ఆహ్వానిస్తున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. హైదరాబాద్ అన్ని అవకాశాలను కల్పిస్తుందని, తమ ప్రభుత్వం అన్ని విధాలుగా సహకరిస్తుందని చెప్పారు. హైటెక్‌సిటీలోని నెట్‌ఫ్లిక్స్‌కు చెందిన ఐలైన్ స్టూడియోస్ కార్యాలయాన్ని సీఎం రేవంత్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బాల్యం నుంచే తనకు సినిమాలు అంటే ఇష్టం ఇష్టమన్నారు. నెట్‌ఫ్లిక్స్ హైదరాబాద్‌కు వచ్చిందంటే హాలీవుడ్ నగరానికి వచ్చినట్లే అని సీఎం వ్యాఖ్యానించారు. నెట్‌ఫ్లిక్స్‌తో తన కల నిజం కాబోతోందని వ్యాఖ్యానించారు. నెట్‌ఫ్లిక్స్ ఐలైన్ స్టూడియోస్ విస్తరణకు తమ ప్రభుత్వం నుంచి పూర్తి సహకారం ఉంటుందని స్పష్టం చేశారు. ఫోర్త్‌సిటీని నిర్మిస్తున్నామని.. నెట్‌ఫ్లిక్స్ విస్తరణకు కావాల్సిన భూమిని ఫ్యూచర్ సిటీలో ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నామని పేర్కొన్నారు. నెట్‌ఫ్లిక్స్ కార్పొరేట్ ఆఫీస్‌ను ఫ్యూచర్ సిటీకి తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమానికి పరిశ్రమలు, ఐటీ శాఖల మంత్రి డి. శ్రీధర్‌బాబు, సినీనటుడు రానా దగ్గుబాటి, నెట్‌ఫ్లిక్స్ ఐలైన్ స్టూడియోస్ సీఈఓ జెఫ్ షాపిరో, తెలంగాణ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ దిల్ రాజు హాజరయ్యారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి ప్రసంగించారు. తనకు సినిమాలపైన ఆసక్తి ఉందని.. తన బాల్యం నుంచి ఇప్పటి వరకు చిత్రరంగంలో అనేక మార్పులు వచ్చాయని సీఎం రేవంత్‌రెడ్డి ప్రస్తావించారు. బాహుబలి, కల్కి, ఆర్ఆర్ఆర్, అరుంధతి వంటి అత్యున్నత సాంకేతికతతో కూడిన సినిమాలు వచ్చాయని చెప్పుకొచ్చారు. చెన్నైలో ఉన్న తెలుగు సినిమా రంగాన్ని నందమూరి తారక రామారావు , అక్కినేని నాగేశ్వరరావు హైదరాబాద్‌కు తీసుకువచ్చారని గుర్తుచేశారు. నెట్‌ఫ్లిక్స్ హైదరాబాద్ వచ్చిందంటే హాలీవుడ్ వచ్చినట్లేనని పేర్కొన్నారు. తమ దృష్టి హాలీవుడ్‌పైనేనని తాను గతంలోనే చెప్పానని ప్రస్తావించారు. ప్రపంచంలోని 500 పెద్ద కంపెనీలను తెలంగాణకు తీసుకురావడానికి తాము ప్రయత్నం చేస్తున్నామని వివరించారు. తెలంగాణలో మీ పెట్టుబడికి పూర్తి రక్షణ ఉంటుందని.. తమ రాష్ట్రం అంటేనే వ్యాపారమని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.

# కోకాపేటలో అల్లు సినిమాస్ మల్టీప్లెక్స్

## లాంఛనంగా ప్రారంభించిన సిఎం రేవంత్

## హాజరైన సినీ, రాజకీయ దిగ్గజనేతలు




**హైదరాబాద్,మార్చి12 :** హైదరాబాద్ కోకాపేటలోని 'అల్లు సినిమాస్' మల్టీప్లెక్స్‌ను సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభించారు. ముఖ్యమంత్రికి నటుడు అల్లు అర్జున్ స్వాగతం పలికారు. మల్టీప్లెక్స్‌లో ఏర్పాటు చేసిన అల్లు రామలింగయ్య విగ్రహానికి సీఎం రేవంత్, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క నివాళులర్పించారు. 'అల్లు సినిమాస్'లోని ఏర్పాట్లను అల్లు అరవింద్, అల్లు అర్జున్ వివరించారు. అనంతరం డాల్బీ స్క్రీన్‌లో ప్రదర్శించిన పలు ప్రచార చిత్రాలను వీక్షించారు. ఈ ఈవెంట్‌లో దర్శకులు రాఘవేంద్రరావు, బోయపాటి శ్రీను, క్రిష్, నందినిరెడ్డి, పలువురు నిర్మాతలు, నటీనటులు పాల్గొన్నారు. 'అల్లు సినిమాస్'లో నాలుగు స్క్రీన్లు ఉండగా.. స్క్రీన్-1లో డాల్బీ విజన్ సౌలభ్యం ఉంది. ఇది ఆసియాలోనే అతి పెద్దదిగా 75 అడుగులు ఉంటుంది. ఉగాది సందర్భంగా ఈ మల్టీప్లెక్స్‌లో సినిమాలు ప్రదర్శన ప్రారంభం కానుంది. శుక్రవారం నుంచి 'బుక్ మై షో' వేదికగా బుకింగ్స్ ఓపెన్ కానున్నాయి. 'ధురంధర్: ది రివెంజ్' మూవీ ప్రీమియర్స్‌తో ప్రేక్షకులకు అనుమతి ఇచ్చే అవకాశం ఉంది.అంతకుముందు గురువారం సాయంత్రం ఈ వేడుక సినీ, రాజకీయ నాయకుల సమక్షంలో గ్రాండ్‌గా జరిగింది.

# తెలంగాణలో కమర్షియల్ సిలిండర్ల కొరత

## నేడు చమురు కంపెనీలతో ప్రభుత్వం చర్చలు

## మంత్రి ఉత్తమ్ క ఉమార్ రెడ్డి వెల్లడి



**హైదరాబాద్,మార్చి12 :** తెలంగాణలో కమర్షియల్ సిలిండర్ల కొరత వాస్తవమేనని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. గురువారం హైదరాబాద్‌లో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి విలేకర్లతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో నిత్యం సరఫరా అవుతున్న వంట గ్యాస్ సిలిండర్లలో దాదాపు 86 శాతం డొమెస్టిక్ కనెక్షన్లేనని ఆయన స్పష్టం చేశారు. అలాగే మిగిలిన 14 శాతం మాత్రమే కమర్షియల్ అని వివరించారు. ప్రస్తుతానికి డొమెస్టిక్ సిలిండర్ల సరఫరాలో ఎలాంటి కొరత లేదని తమ శాఖ అధికారులు వెల్లడించారని చెప్పారు. కానీ కమర్షియల్ సిలిండర్ల సరఫరాలో మాత్రం కొన్ని ఇబ్బందులు ఉన్నాయన్నది వాస్తవమని తెలిపారు. రాష్ట్రంలో వంట గ్యాస్ తాజా పరిస్థితిపై చర్చించేందుకే ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, పౌర సరఫరాల శాఖ ఉన్నతాధికారులు, చమురు కంపెనీల ప్రతినిధులతో శుక్రవారం సమీక్షిస్తామని మంత్రి ఉత్తమ్ వివరించారు. రాష్ట్రంలో రోజూ ఎన్ని కమర్షియల్ సిలిండర్లు అవసరం, సరఫరా ఏ మేరకు ఉంది, గ్యాస్ కొరతకు గల కారణాలు, అందుకు అధిగమించేందుకు తీసుకోవాల్సిన చర్యలతోపాటు ప్రత్యామ్నాయాలపై దృష్టి పెట్టేందుకున్న మార్గాలన్నింటిపై చర్చించనున్నట్లు మంత్రి ఉత్తమ్ వివరించారు. అలాగే పూర్తి వివరాలతో రావాలని ఆయిల్ కంపెనీల ప్రతినిధులతోపాటు అధికారులకు సమాచారం ఇచ్చామన్నారు. పరిస్థితి చేయి దాటి పోకుండా ఉండేందుకు ఎప్పటికప్పుడు పరిస్థితిని పర్యవేక్షిస్తున్నట్లు మంత్రి ఉత్తమ్ వెల్లడించారు.రో వైపు.. ఇరాన్, ఇజ్రాయెల్ మధ్య భీకర పోరు కొనసాగుతోంది. దీని ప్రభావంతో దేశవ్యాప్తంగా గ్యాస్, చమురుకు తీవ్ర కొరత ఏర్పడింది. గ్యాస్ సిలిండర్లకు ఎలాంటి కొరత లేదని కేంద్రం చెబుతున్నప్పటికీ.. వాస్తవ పరిస్థితి మాత్రం పూర్తి భిన్నంగా ఉంది. తెలంగాణలో వంట గ్యాస్ సిలిండర్ల సరఫరాకు ఇబ్బందులు ఏర్పడ్డాయి. దాంతో హోటళ్లు, హాస్టల్స్, మెస్‌లకు అవసరమైన మేర కమర్షియల్ సిలిండర్ల సరఫరా లేకపోవడంతో నగరంలో చాలా ప్రాంతాల్లో అవి మూతపడ్డాయి. ఈ నేపథ్యంలో గ్యాస్ సిలిండర్ల కొరత నివారణకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టింది. అందుకోసం శుక్రవారం వివిధ శాఖల ఉన్నతాధికారులతో పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సమీక్ష నిర్వహించనున్నారు.

# నిజామాబాద్ జిల్లాలో దారుణ హత్య

## కాంగ్రెస్ నేతను హతమార్చిన సమీప బంధువు

## కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు

నిజామాబాద్,మార్చి12 : నిజామాబాద్ జిల్లాలో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, ఇందల్వాయి మాజీ ఎంపీపీ ఇమ్మడి గోపీ గురువారం దారుణ హత్యకు గురయ్యారు. ఈ ఘటన నిజామాబాద్ జిల్లాలోనే కాకుండా తెలంగాణ రాజకీయ వర్గాల్లో కూడా తీవ్ర చర్చకు దారితీసింది. కుటుంబ రాజకీయ విభేదాలు ఈ హత్యకు కారణంగా తెలుస్తోంది. ముఖ్యంగా గ్రామస్థాయి రాజకీయాల్లో పెరిగిన విభేదాలు చివరకు రక్తపాతం వరకు వెళ్లినట్లు సమాచారం. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... నిజామాబాద్ జిల్లా ఇందల్వాయి మండలంలో ఈ దారుణ ఘటన చోటుచేసుకుంది. కాంగ్రెస్‌లో కీలక నేతగా గుర్తింపు పొందిన ఇమ్మడి గోపీపై ఆయనకు బంధువైన సతీశ్ దాడి చేశాడు. ముందుగా కారుతో గుద్ది, అనంతరం కత్తితో దాడి చేసి గోపీని హత్య చేసినట్లు పోలీసులు చెబుతున్నారు. ఈ దాడిలో తీవ్ర గాయాల కారణంగా గోపీ అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. ఈ సంఘటన అనంతరం సతీశ్ నేరుగా పోలీస్ స్టేషన్‌కు వెళ్లి లొంగిపోయాడు. పోలీసులు అతన్ని అదుపులోకి తీసుకుని విచారణ ప్రారంభించారు. సతీశ్, ఇమ్మడి గోపీకి వరుసకు మేనల్లుడు. ఒకే కుటుంబానికి చెందిన వారైనా, గ్రామ రాజకీయాల్లో ఏర్పడిన విభేదాలు వారిద్దరి మధ్య తీవ్ర శత్రుత్వంగా మారాయి. గ్రామంలో రాజకీయంగా ఇద్దరూ ప్రభావం చూపే స్థాయిలో ఉండటంతో, కాలక్రమేణా వీరి మధ్య విభేదాలు పెరిగాయి. ముఖ్యంగా గ్రామ సర్పంచ్ ఎన్నికల తర్వాత ఈ విభేదాలు మరింత తీవ్రమయ్యాయని స్థానికులు చెబుతున్నారు. గత గ్రామ పంచాయతీ ఎన్నికల్లో గౌరవరం గ్రామంలో సర్పంచ్ పదవికి ఇమ్మడి గోపీ భార్య పోటీ చేసి విజయం సాధించారు. అదే ఎన్నికల్లో సతీశ్ భార్య కూడా సర్పంచ్ పదవికి పోటీ చేశారు. అయితే ఆ ఎన్నికల్లో ఆయన భార్య ఓడిపోయారు. అప్పటి నుంచి రెండు కుటుంబాల మధ్య రాజకీయంగా తీవ్రమైన విభేదాలు మొదలయ్యాయి. గ్రామ రాజకీయాల్లో ఆధిపత్యం కోసం ఇరువర్గాల మధ్య తరచూ గొడవలు జరిగేవని తెలుస్తోంది. సర్పంచ్ ఎన్నికల ఫలితాల తర్వాత పరిస్థితి మరింత ఉద్రిక్తంగా మారింది. చిన్న చిన్న విషయాలపై కూడా ఇరువర్గాల మధ్య తగాదాలు జరిగేవని సమాచారం. ఇమ్మడి గోపీ హత్యతో గౌరవరం గ్రామంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఘటన తెలిసిన వెంటనే గ్రామానికి పెద్దఎత్తున పోలీసులు చేరుకున్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు గ్రామంలో భద్రతను పెంచారు. స్థానికంగా గోపీ కీలక నాయకుడిగా గుర్తింపు పొందారని ఆయన అనుచరులు చెబుతున్నారు. గోపీ మరణంతో గ్రామ ప్రజలు కూడా తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. హత్య చేసిన తర్వాత సతీశ్ పోలీసులకు లొంగిపోయాడు. ఆ తర్వాత అతన్ని అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు. హత్యకు అసలు కారణాలు ఏమిటి..?, ముందుగా ప్రణాళికతోనే గోపీని హత్య చేశాడా..? అనే పలు కోణాల్లో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ప్రాథమికంగా చూస్తే కుటుంబ రాజకీయ విభేదాలే ఈ హత్యకు ప్రధాన కారణంగా పోలీసులు భావిస్తున్నారు. అయితే పూర్తి వివరాలు దర్యాప్తు తర్వాతే వెల్లడయ్యే అవకాశం ఉంది.

మానేరు
జనత
తెలుగు దినపత్రిక | ఇది జనం గొంతుక
www.epaperjanathadaily.in
శుక్రవారం 13 మార్చి 2026


# గ్యాస్ కొరతపై కేంద్రం జోక్యం చేసుకోవాలి

**ఎల్పీజీ సిలిండర్ల కొరతపై కేంద్రానికి కేటీఆర్ లేఖ**

**హోటళ్లు, హాస్టళ్లు మూతపడే ప్రమాదమని హెచ్చరిక**

**చిన్న వ్యాపారులకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచన**

**బ్లాక్ మార్కెట్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్**

**గ్యాస్ ఆధారిత శ్మశానవాటికలను అత్యవసర సేవలుగా గుర్తించాలని విజ్ఞప్తి**



**హైదరాబాద్:** దేశంలో వాణిజ్య, గృహ వినియోగ ఎల్పీజీ సిలిండర్ల తీవ్ర కొరత ఏర్పడిందని, ఈ సంక్షోభాన్ని పరిష్కరించేందుకు తక్షణమే జోక్యం చేసుకోవాలని బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు ఆయన గురువారం కేంద్ర పెట్రోలియం, సహజవాయువు శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పూరీకి ఒక లేఖ రాశారు. ఎల్పీజీ సరఫరాలో అంతరాయం కారణంగా హోటళ్లు, తినుబండారాలు, పీజీ హాస్టళ్లు, చిన్న ఆహార వ్యాపారాలు తీవ్రంగా ప్రభావితమవుతున్నాయని కేటీఆర్ తన లేఖలో ఆందోళన వ్యక్తం చేశారు. సరఫరాను వెంటనే పునరుద్ధరించకపోతే, వేలాది సంస్థలు మూతపడే ప్రమాదం ఉందని, వాటిపై ఆధారపడిన లక్షలాది మంది కార్మికులు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటారని హెచ్చరించారు. ఈ సంక్షోభాన్ని ఎదుర్కొనేందుకు కేటీఆర్ కేంద్రానికి కొన్ని కీలక సూచనలు చేశారు. చిన్న వ్యాపారులకు ప్రాధాన్యతనిచ్చేలా ఎల్పీజీ కేటాయింపుల విధానాన్ని ప్రవేశపెట్టాలని సూచించారు. జిల్లాల వారీగా సిలిండర్ల లభ్యతపై పారదర్శక సమాచారం కోసం రియల్-టైమ్ పబ్లిక్ డ్యాష్‌బోర్డును ఏర్పాటు చేయాలని కోరారు. సంక్షోభ సమయంలో చిన్న వ్యాపారులపై అదనపు భారం పడకుండా వాణిజ్య సిలిండర్ల ధరల పెరుగుదలను తాత్కాలికంగా నిలిపివేయాలని విజ్ఞప్తి చేశారు. గృహ వినియోగ సిలిండర్లను అక్రమంగా వాణిజ్య అవసరాలకు మళ్లించి, అధిక ధరలకు విక్రయించే బ్లాక్ మార్కెట్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. ఐటీ కారిడార్ ప్రాంతాల్లోని పీజీ హాస్టళ్లను ప్రత్యేక కేటగిరీగా గుర్తించి, అంతరాయం లేని సరఫరాను అందించాలని కోరారు. అలాగే, గ్యాస్ ఆధారిత శ్మశానవాటికలను అత్యవసర సేవలుగా వర్గీకరించి, వాటి కార్యకలాపాలకు ఆటంకం కలగకుండా చూడాలని కేటీఆర్ తన లేఖలో పేర్కొన్నారు. ఇది లక్షలాది మంది జీవితాలను ప్రభావితం చేసే తీవ్రమైన సమస్య అని, వెంటనే స్పందించి సరఫరాను పునరుద్ధరించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు.

# అసెంబ్లీలో రిటైర్డ్ ఉద్యోగుల సమస్యలు ప్రస్తావిస్తా

**ప్రభుత్వ తీరును ఎండగడతామన్న హరీష్ రావు**



**హైదరాబాద్,మార్చి12 :** ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయలు, రిటైర్డ్ ఉద్యోగుల పై ముఖ్యమంత్రి కర్కశంగా వ్యవహరిస్తున్నారని మాజీ మంత్రి , ఎమ్మెల్యే హరీష్‌రావు ఆరోపించారు. ఉద్యోగులకు రావలసిన హక్కులను వేడుకోవాల్సిన పరిస్థితి ఏర్పడడం దురదృష్టకరమని అన్నారు. తెలంగాణ రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ప్రతినిధులు గురువారం హరీష్ రావును కలిసి వినతి పత్రం అందచేశారు. ప్రభుత్వ తీరు వల్ల బెన్‌ఫిట్లు, పెన్షన్ బకాయిలు రాక మనోవేదనకు గురై ఎంతో మంది ప్రాణాలు కోల్పోతున్నారని , వందల సంఖ్యలో అనారోగ్యం పాలై ఆసుపత్రుల చుట్టూ తిరుగుతున్నారని విమర్శించారు. ప్రభుత్వం బకాయిలు చెల్లించే వరకు ప్రభుత్వాన్ని వదిలి పెట్టబోమని, రిటైర్డ్ ఉద్యోగుల పోరాటానికి బీఆర్ఎస్ అండగా అంటుందని, అసెంబ్లీ వేదికగా నిలదీస్తామని భరోసా ఇచ్చారు. రిటైర్డ్ ఉద్యోగులకు బెనిఫిట్స్ చెల్లించకపోవడానికి కారణం డబ్బులు లేక కాదు. ముఖ్యమంత్రికి మనసు రాక అని పేర్కొన్నారు. మూసీ బ్యూటిఫికేషన్ కోసం లక్షన్నర కోట్లు, ఫ్యూచర్ సిటీ కోసం లక్ష కోట్లు, అందాల పోటీల కోసం వందల కోట్లు, తన సోకుల కోసం నిర్వహించే ఫుట్‌బాల్ మ్యాచ్‌కు 100 కోట్లు ఖర్చు

చేస్తున్నారని విమర్శించారు. ముఖ్యమంత్రి క్యాంప్ ఆఫీస్ కోసం వందల కోట్లు, వివిధ రాష్టాల్లో వందల కోట్లతో పత్రిక ప్రకటనలు ఇచ్చే రేవంత్ రెడ్డి, రిటైర్డ్ ఉద్యోగుల బకాయిలు చెల్లించక పోవడం దారుణమన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత 98 వేల కోట్లకు టెండర్లు పిలిచారని, బడా కాంట్రాక్టర్లకు 40 వేల కోట్లు చెల్లించారని , కానీ ఉద్యోగులకు చెల్లించాల్సిన జీతాలు, బెనిఫిట్స్ కోసం మాత్రం డబ్బులు ఇవ్వడం లేదని ఆరోపించారు. కమీషన్లు రావు కాబట్టి వీరికి బకాయిలు చెల్లించడం లేదని దుయ్యబట్టారు. అసెంబ్లీ సమావేశాల్లో సమావేశాల్లో రిటైర్డ్ ఉద్యోగుల సమస్యలు, చెల్లించాల్సిన బకాయిలపై ప్రభుత్వాన్ని నిలదీయాలని కోరారు.

# ఆరులక్షల టన్నలు యూరియా కేటాయించండి

**కేంద్రానికి మంత్రి తుమ్మల లేఖ**

**హైదరాబాద్,మార్చి12 :** ఈ ఏడాది ఖరీఫ్ కోసం ముందస్తుగా యూరియా నిల్వలు సిద్ధం చేయాలని తెలంగాణ ప్రభుత్వం నిర్ణయించింది ఈ నేపథ్యంలో రానున్న మూడు నెలలకు.. ఆరు లక్షల మెట్రిక్ టన్నులు యూరియా కేటాయించాలని కేంద్రాన్ని రాష్ట్ర ప్రభుత్వం కోరింది. ఏప్రిల్, మే, జూన్‌కు నెలకు 2 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా అవసరమని స్పష్టం చేసింది. ఈ మేరకు కేంద్ర మంత్రి జేపీ నడ్డాకు లేఖ రాసినట్లు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు గురువారం హైదరాబాద్‌లో వెల్లడించారు. ఖరీఫ్ ప్రారంభానికి రాష్ట్రంలో సుమారు 50 వేల టన్నుల ప్రారంభ నిల్వలు మాత్రమే ఉండే అవకాశం ఉందన్నారు. తెలంగాణలో 70 శాతం పంటలు ఖరీఫ్ సీజన్‌లోనే సాగవుతాయని మంత్రి తుమ్మల వివరించారు. జులై, ఆగస్టులలో యూరియా డిమాండ్ గరిష్ఠంగా పెరిగే అవకాశం ఉందని అభిప్రాయ పడ్డారు. నెలకు సుమారు 3 లక్షల మెట్రిక్ టన్నులు అవసరమవుతుందని తెలిపారు. ఎరువుల పంపిణీ పారదర్శకతకు యూరియా యాప్ తీసుకొచ్చినట్లు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు గుర్తు చేశారు.

# శరవేగంగా హైకోర్టు నిర్మాణ పనులు

**పనులను పరిశీలించిన చీఫ్ జస్టిస్**

**హైదరాబాద్,మార్చి12 :** తెలంగాణ ప్రభుత్వం రాజేంద్రనగర్‌లో ప్రతిష్టాత్మకంగా హైకోర్టు భవన సముదాయం నిర్మాణం చేపట్టింది. ప్రస్తుతం ఈ ప్రాజెక్టులో భాగంగా జోన్-ఎలో 40 ఎకరాల విస్తీర్ణంలో ఇన్‌స్టిట్యూషనల్ భవనాల నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. అదే విధంగా జోన్-ఎఎలో సుమారు 60 ఎకరాల భూమిని గౌరవ ముఖ్య న్యాయమూర్తి ,మరియు న్యాయమూర్తుల కోసం అవసరమైన సౌకర్యాలతో కూడిన నివాస విల్లాల నిర్మాణానికి కేటాయించారు. ఈ నివాస విల్లాల నిర్మాణానికి ఏప్రిల్ 5న భూమిపూజ కార్యక్రమం నిర్వహించాలని న్యాయవ్యవస్థ అధికారులు నిర్ణయించారు. నేపథ్యంలో గురువారం గౌరవ ముఖ్య న్యాయమూర్తి అపరేష్ కుమార్ సింగ్ , గౌరవ న్యాయమూర్తులు మరియు రోడ్లు-భవనాల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్ కలిసి నిర్మాణ స్థలాన్ని సందర్శించారు. కార్యక్రమానికి అవసరమైన అన్ని ఏర్పాట్లు చేపట్టాలని రోడ్లు-భవనాల శాఖ అధికారులకు సూచించారు. అలాగే పనులు వేగంగా ముందుకు సాగేందుకు కాంట్రాక్టర్ సంస్థ ప్రతినిధులతో కలిసి సమన్వయం చేసుకుని అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

# అభివృద్ధి పనులపై దృష్టి పెట్టండి

**గెలిచే వరకే రాజకీయాలు..తరవాత అభివృద్ధి**

**ప్రజాప్రతినిధులకు మంత్రి పొంగులేటి హితవు**




**ఖమ్మం,మార్చి12 :** ప్రజాప్రతినిధులు అభివృద్ధి పనులపై దృష్టి సారించాలని తెలంగాణ రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వ్యాఖ్యానించారు. ఎన్నికల వరకే రాజకీయాలని.. ఎన్నికల్లో గెలిచిన తర్వాత ప్రతి ఒక్కరూ ప్రజలకు మంచి చేసే ప్రజా ప్రతినిధులేనని పేర్కొన్నారు. మంచి కార్యక్రమాలను ప్రోత్సహించేందుకు అధికారులు కృషి చేయాలని సూచించారు. గురువారం ఖమ్మం భక్త రామదాసు కళాక్షేత్రంలో ప్రజా ప్రతినిధులకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక శిక్షణా కార్యక్రమంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పాల్గొని ప్రసంగించారు. తమ ప్రభుత్వం 6 తేదీ నుంచి 99 రోజుల పాటు ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక రూపొందించిందని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. సర్పంచ్‌గా ఆ వ్యక్తి ఉంటే గ్రామం అభివృద్ధి జరిగిందని చెప్పుకునేలా పని చేయాలని దిశానిర్దేశర చేశారు. అధికారులు కలెక్టర్, పోలీస్ కమిషనర్‌లు వారు ఉన్నప్పుడు మంచి పనులు జరిగాయని ప్రజలు చెప్పుకోవాలన్నారు. ఓట్లు వేసిన ప్రజలకు మంచి చేయాల్సిన బాధ్యత, ఆయా ప్రాంతాలను అభివృద్ధి చేసే బాధ్యత మనపై ఉందని చెప్పుకొచ్చారు. గ్రామ పంచాయతీ వ్యవస్థ వచ్చిన తర్వాత ఇంత పెద్ద మొత్తంలో నిధులు వచ్చిన దాఖలాలు లేవని తెలిపారు. మార్చి 31వ తేదీ లోపు అభివృద్ధి పనుల కోసం నిధులు మళ్లీ వస్తాయని.. వచ్చిన నిధులను ప్రణాళికబద్ధంగా, ప్రజలకు ఉపయోగపడేలాగా వినియోగించాలని మార్గనిర్దేశర చేశారు. సర్పంచ్‌లకు మునుపే ట్రైనింగ్ ఇచ్చారని, వారి విధులు ఏంటి, మీరు ఎలా పని చేయాలనే విషయాలు ఇప్పటికే అర్థమై ఉంటుందని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. వేసవిలో తాగునీరు సమస్య లేకుండా అధికారులు, ప్రజాప్రతినిధులు పని చేయాలని ఆదేశించారు. ఏ గ్రామ పంచాయతీకి అత్యధిక నిధులు వచ్చాయో ఆ నిధులను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్‌ను ఆదేశించారు. ప్రజాప్రతినిధులు గ్రామాల అభివృద్ధిలో భాగస్వామ్యం అవ్వాలని సూచించారు. ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య భాగస్వామ్యం అయ్యేలా పని చేయాలని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి దిశానిర్దేశర చేశారు.

# ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలంగాణాకు ఐకాన్

**1000 కోట్లతో అభివృద్ధికీ రూట్ మ్యాప్**

**నిధులు మంజూరు చేయడం అభినందనీయం**

**ముఖ్యమంత్రికి మంత్రి ఉత్తమ్ ప్రత్యేక ధన్యవాదాలు**




**హైదరాబాద్,మార్చి12 :** ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలంగాణా రాష్ట్రానికి ప్రత్యేక ఐకాన్ గా నిలిచిందని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖామంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. అటువంటి విశ్వవిద్యాలయం మన రాష్ట్రంలో ఉండడం మనకెంతో గర్వకారణమని ఆయన చెప్పారు. ఇంతటి పేరెన్నికగన్న ఉస్మానియా విశ్వవిద్యాలయం అంతర్జాతీయ స్థాయికి ఎదగాలని తాను కాంక్షిస్తున్నానని ఆయన చెప్పారు. గురువారం ఉదయం ఉస్మానియా విశ్వవిద్యాలయం ఇంజినీరింగ్ విభాగంలో ఆయన నిర్మాణ్-26 సాంకేతిక సదస్సును ప్రారంభించారు. సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ 1917 లో స్థాపించిన ఈ విశ్వవిద్యాలయం తెలంగాణా రాష్ట్రానికి ప్రత్యేక గుర్తింపు తెచ్చిందన్నారు.అందుకు కొనసాగింపుగా 1929 లో విశ్వవిద్యాలయం సౌజన్యంతో ప్రారంభం అయిన ఇంజినీరింగ్ కళాశాల యావత్ భారతదేశంలోనే అత్యంత ప్రాశస్త్యమైన కళాశాలలలో ఆరవ స్థానంలో నిలిచిందని ఆయన చెప్పారు. అంతటి ప్రఖ్యాతి గాంచిన విశ్వవిద్యాలయం అభివృద్ధికీ ప్రత్యేకంగా ప్రణాళికలు రూపొందించడమే కాకుండా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఏకంగా 1,000 కోట్లు నిధులు మంజూరు చేయడం అభినందనీయమని ఆయన ప్రశంసించారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం చరిత్రలోనే ఇంత పెద్ద ఎత్తున నిధులు మంజూరు చేయడం చారిత్రాత్మక ఘట్టంగా ఆయన అభివర్ణించారు.అంతర్జాతీయ స్థాయిలో ఈ విశ్వవిద్యాలయాన్ని తీర్చిదిద్దాలి అన్నదే ప్రభుత్వ సంకల్పం అని అందుకనుగుణంగా కార్యాచరణ ప్రణాళికలు రూపొందించినట్లు ఆయన వెల్లడించారు. విశ్వవిద్యాలయంలో అవసరమైన అధ్యాపకుల భర్తీ విషయాన్ని ఆయన ప్రస్తావిస్తూ ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డితో చర్చించి చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. ఇక్కడి నుండి ఎంతో మేధో సంపద ఉత్పత్తి అయిందని ఆ మేధస్సు ప్రపంచ స్థాయిలో అభివృద్ధికి దోహద పడుతుందన్నారు. సిలికాన్ వ్యాలీలో పనిచేస్తున్న మెజారిటీ ఇంజినీర్లు ఉస్మానియా విశ్వవిద్యాలయం నుండే ఎదిగిన వారు అని,అంతే గాకుండా గల్లీ నుండి డిల్లో స్థాయికి ఎదిగిన నేతలు,క్రీడాకారులు,ఉన్నత పదవులు చేపట్టిన వారి అడుగులు ఇక్కడి నుండే మొదలు అయ్యాయని ఆయన చెప్పారు. అటువంటి విశ్వవిద్యాలయం తెలంగాణా రాష్ట్ర ఉద్యమంలో అగ్రభాగాన నిలుచోవడమే కాకుండా విద్యార్థులు చేసిన త్యాగాలు ఇక్కడ ప్రస్తావ-నర్హమే అని భావిస్తున్నానని ఆయన చెప్పారు. ఇక్కడ విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులు విద్యతో పాటు క్రీడలు,సాంస్కృతిక కార్యక్రమాలలో కుడా భాగస్వామ్యం కావాలని ఆయన ఉద్బోధించారు. ఇంజినీరింగ్ విభాగం గురుంచి ఆయన ప్రస్తావిస్తూ తెలంగాణా రాష్ట్ర అభివృద్ధిలో ఇంజినీరింగ్ విభాగం ముఖ్య భూమిక పోషిస్తుందని ఆయన చెప్పారు. నిజాంసాగర్, నాగార్జునసాగర్, శ్రీశైలం వంటి భారీ ప్రాజెక్టులతో పాటు ఎస్.ఎల్.బి.సి, దేవాదుల వంటి ఆధునిక ప్రాజెక్టులు ఇంజినీరింగ్ ప్రతిభకు అద్దం పడుతున్నాయన్నారు. సివిల్ ఇంజినీరింగ్ విభాగము విద్యార్థులకు ప్రాక్టికల్స్ పాఠాలుగా ఉపయోగ పడుతాయని ఆయన చెప్పారు. భవిష్యత్లో స్థిరమైన అభివృద్ధి,ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం వినియోగం, జలవనరుల సమగ్ర నిర్వహణ తో పాటు చెక్ డ్యామ్ ల పునరుద్ధరణ వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఇంజినీర్లు ప్రాజెక్టుల నిర్మాణాలకు మాత్రమే పరిమితం కాకుండా వాటి భద్రత,నిర్వహణ బాధ్యతలు కుడా ఇంజినీర్లకు ఉంటాయన్నారు. నిర్మాణ్-26 వంటి సాంకేతిక సదస్సులు విద్యార్థులకు పరిశోధన,సృజనాత్మక తాను పెంపొందించే వేడికలని ఆయన చెప్పారు. మన నిర్మాణాలు కేవలము కట్టడాలకే పరిమితము కాకుండా ప్రజల జీవితాలలో వెలుగులు నింపేందుకు దోహద పడాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఉద్బోధించారు.

# చిరంజీవిని కలసిన దిల్‌రాజు, ప్రియాంక

**గద్దర్ అవార్డుల ఫంక్షన్‌కు ఆహ్వానం**

**హైదరాబాద్,మార్చి12 :** తెలంగాణ గద్దర్ ఫిల్మ్ అవార్డ్స్ వేడుకల్లో పాల్గొనాల్సిందిగా మెగాస్టార్ చిరంజీవిని తెలంగాణ చలనచిత్ర అభివృద్ధి సంస్థ చైర్మన్ దిల్ రాజు, మేనేజింగ్ డైరెక్టర్ ప్రియాంక కోరారు. అలాగే గద్దర్ అవార్డును స్వీకరించాల్సిందిగా అభ్యర్థించారు. గురువారం మెగాస్టార్ చిరంజీవి వీరు మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ప్రభుత్వం ప్రకటించిన ప్రతిష్టాత్మక 'ఎన్టీఆర్ నేషనల్ ఫిలిం అవార్డు' ను స్వీకరించాల్సిందిగా వారు చిరంజీవిని సాదరంగా ఆహ్వానించారు. మార్చి 19, హైదరాబాద్‌లోని హైటెక్స్ వేదికగా జరగనున్న అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమానికి విచ్చేసి, ఈ గౌరవాన్ని అందుకోవాలని వారు కోరారు.

# ఉద్యోగం వచ్చేవరకు భార్యకు చేదోడువాదోడు

**ఎక్సైజ్ సిఐగా ఎన్నికయ్యాక భర్తకు వేధింపులు**

**భార్య వేధింపులు తట్టుకోలేక వ్యక్తి ఆత్మహత్య**

**నేరెడ్ మెట్ పరిధిలో ఘటన..పోలీసులు దర్యాప్తు**

**హైదరాబాద్,మార్చి12 :** భార్య వేధింపులు తాళలేక భర్త ఆత్మహత్య చేసుకున్న ఘటన కలకలం సృష్టించింది. నేరేడ్‌మెట్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఈ ఘటన చోటు చేసుకుంది. స్థానిక పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. లక్ష్మీనగర్‌కు చెందిన నగెల్లి శ్రీనివాస్(41) ఓ ప్రైవేట్ ఉద్యోగి. అతని స్వగ్రామం మంచిర్యాల జిల్లా మందమర్రి మండలం రామకృష్ణాపూర్. శ్రీనివాస్ 2012లో జ్యోతిని పెళ్లి చేసుకున్నాడు. ఈ దంపతులకు ఓ కుమారుడు ఉన్నాడు. భార్య గ్రూప్స్ పరీక్షలకు ప్రిపేర్ అయ్యేందుకు భర్త శ్రీనివాస్ చాలా హెల్ప్ చేశాడు. భర్త సహాయంతో జ్యోతి గ్రూప్స్‌లో విజయం సాధించి ఎక్సైజ్ సీఐగా నియమితులయ్యింది. ఉద్యోగం వచ్చిన తర్వాత భర్తను దూరం పెట్టడం స్టార్ట్ చేసింది. అంతే కాదు.. భర్తపై వరకట్నం వేధింపులు, విడాకుల కేసులు పెట్టింది. వేధింపులకు పాల్పడటంతో శ్రీనివాస్ తట్టుకోలేక పోయాడు. తీవ్ర మనస్తాపానికి గురై మంగళవారం రాత్రి ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. 'భార్య వేధింపులు, కేసుల కారణంగా ఆత్మహత్య చేసుకుంటున్నాను' అని సూసైడ్ నోట్ రాశాడు. శ్రీనివాస్ సోదరుడు శివకృష్ణ ఇంటికి వచ్చి చూడగా అతను మృతిచెందినట్లు గుర్తించాడు. అనంతరం పోలీసులకు సమాచారం ఇచ్చారు. సోదరుడి ఫిర్యాదు మేరకు శ్రీనివాస్ భార్య జ్యోతి సహా మరో 10 మందిపై కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

# యుద్ధ సంక్షోభంలో భారత్ తొలి విజయం

## హర్మూజ్ జలసంధి నుంచి భారత్‌కు చమురు నౌక

## క్షేమంగా ముంబై తీరం చేరుకున్నషెన్‌లాంగ్

## ఇరాన్ పరోక్ష మద్దతుతో తొలి నౌక రాక

**ముంబై,మార్చి12 :** పశ్చిమాసియా ఉద్రిక్తతల వేళ ఒక చమురు నౌక హర్మూజ్‌ను దాటి భారత్‌కు చేరుకుంది. ఎటువైపు నుంచి క్షిపణి దూసుకొస్తుందో తెలియని ఘర్షణ వాతావరణంలో జలసంధిని సురక్షితంగా దాటి, ముంబయి పోర్ట్‌కు చేరుకున్న తొలినౌక ఇదే కావడం విశేషం. అయితే హర్మూజ్ నుంచి రావడానికి ఇరాన్ పరోక్షంగా సహకరించిందని సమాచారం. హర్మూజ్ అంతరాయాలతో భారత్‌లో ఇంధన ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఈ సమయంలో షెన్‌లాంగ్ విజయవంతంగా దేశానికి చేరడం, మ-రోవైపు భారత పతాక నౌకలు హర్మూజ్‌నుంచి వెళ్లొచ్చని ఇరాన్ అనుమతిచ్చినట్లు వార్తలు రావడం ఊరటనిస్తోంది. దీనిని నడిపిన కెప్టెన్ కూడా ఇండియనే. లైబీరియా జెండాతో ఉన్న షెన్‌లాంగ్ సూయెజ్‌మాక్స్ చమురు ట్యాంకర్ బుధవారం ముంబయి నౌకాశ్రయానికి చేరుకుంది. మూడు రోజుల క్రితమే అది హర్మూజ్ ను దాటింది. తన ప్రయాణాన్ని ఎవరూ ట్రాక్ చేయకుండా చురుగ్గా వ్యవహరించింది. మార్చి ఒకటిన ఈ ట్యాంకర్ సౌదీ అరేబియా పోర్ట్ వద్ద చమురు లోడ్ చేసుకుంది. మారిటైమ్ ట్రాకింగ్ డేటా ప్రకారం.. దాని సిగ్నల్స్ మార్చి 8న హర్మూజ్‌లో కనిపించాయి. ఆ తర్వాత అది జాడలేకుండా పోయింది. నౌకలోని సిబ్బంది ఆటోమేటిక్ ఐడెంటిఫికేషన్ సిస్టమ్ , ట్రాన్స్‌పాండర్లను స్విచ్ఛాఫ్ చేశారని తెలుస్తోంది. ప్రస్తుతం అడుగడుగునా ప్రమాదకరంగా మారిన హర్మూజ్‌లో గుర్తింపు తెలియకుండా సిబ్బంది ఈ నిర్ణయం తీసుకున్నారు. జలసంధిని దాటి ఇండియా దిశగా ప్రయాణిస్తున్నప్పుడు.. అంటే ఒకరోజు తర్వాత మళ్లీ ట్రాకింగ్ సిస్టమ్స్‌లో ఈ షిప్ కనిపించింది. సంక్షోభ సమయాల్లో ప్రత్యర్థులకు చిక్కకుండా ఉండేందుకు అసాధారణ పరిస్థితుల్లో షిప్పింగ్ కంపెనీలు ఈ టెక్నిక్‌ను వాడుతుంటాయి. దీనిని గోయింగ్ డార్క్ గా చెప్తుంటారు. అంతర్జాతీయ సముద్రయాన నిబంధనల ప్రకారం.. భద్రత, రియల్ టైమ్ ట్రాకింగ్ కోసం ఏఐఎస్‌ను ఎప్పుడూ యాక్టివ్‌గానే ఉంచాలి. ఇక, ఇప్పుడు ముంబయికు షెన్‌లాంగ్.. 1,35,335 మెట్రిక్ టన్నుల చమురును మోసుకొచ్చింది. గ్రీస్‌లోని డైనకామ్ ట్యాంకర్ మేనేజ్‌మెంట్ లిమిటెడ్ ఈ నౌక కార్యకలాపాలు చూస్తోంది. 29 మంది సిబ్బందిలో భారతీయులతో సహా పాకిస్థాన్, ఫిలిప్పీన్స్ జాతీయులు ఉన్నారు. కెప్టెన్ సుఖాంత్ సింగ్ సింధు భారతీయుడే కావడం విశేషం.

# కాశ్మీర్ మాజీ సిఎం ఫరూక్ అబ్దుల్లాపై హత్యాయత్నం

## తృటిలో తప్పించుకున్న మాజీ ముఖ్యమంత్రి

## తనది 20 ఏళ్ల పగ అన్న దుండగుడు

**జమ్ము,మార్చి12 :** జమ్మూకశ్మీర్ మాజీ ముఖ్యమంత్రి ఫరూక్ అబ్దుల్లాపై హత్యాయత్నం జరిగింది. ఓ వివాహ వేడుకలో నిందితుడు ఆయనపై కాల్పులకు పాల్పడేందుకు ప్రయత్నించాడు. వెంటనే భద్రతా సిబ్బంది అప్రమత్తమవడంతో.. ఫరూక్ సురక్షితంగా బయటపడ్డారు. 20 ఏళ్లుగా తాను ఫరూక్‌ను చంపాలనుకుంటున్నానని నిందితుడు పోలీసులతో పేర్కొన్నాడు. బుధవారం జమ్మూ శివార్లలోని హోటల్‌లో జరిగిన ఓ వివాహ వేడుకకు ఫరూక్ అబ్దుల్లా హాజరయ్యారు. ఆయనతో పాటు జమ్మూకశ్మీర్ డిప్యూటీ సీఎం సురీందర్ ఛౌదరీ కూడా ఉన్నారు. ఈ క్రమంలో ఓ వ్యక్తి వెనక నుంచి ఫరూక్‌పై పాయింట్ బ్లాంక్ రేంజ్‌లో తుపాకీతో కాల్చేందుకు ప్రయత్నించాడు. అక్కడ ఉన్నవారు వెంటనే అతడిని పట్టుకొని చితకబాదారు. దీనికి సంబంధించిన సీసీటీవీ దృశ్యాలు కూడా తాజాగా వెలుగులోకి వచ్చాయి. నిందితుడు జమ్మూకి చెందిన 63 ఏళ్ల కమల్‌సింగ్ జమ్వాల్‌గా పోలీసులు గుర్తించారు. జమ్మూలో దుకాణాలు నడుపుతోన్న కమల్ విచారణ సమయంలో కీలక విషయాలు వెల్లడించాడు. గత 20 ఏళ్లుగా తాను ఫరూక్ అబ్దుల్లాను చంపాలనుకుంటున్నానని పేర్కొన్నాడు. ఇది తన వ్యక్తిగత అజెండాగా వెల్లడించాడు. కాల్పులకు ఉపయోగించిన తుపాకీకి లైసెన్స్ ఉన్నట్లు తెలిపాడు. ఘటన సమయంలో నిందితుడు మద్యం మత్తులో ఉన్నాడని పోలీసులు పేర్కొన్నారు. తుపాకీని స్వాధీనం చేసుకున్నామని, ఘటనపై దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. తన తండ్రిపై జరిగిన హత్యాయత్నంపై జమ్మూకశ్మీర్ సీఎం ఒమర్ అబ్దుల్లా స్పందించారు. లోడ్ చేసిన తుపాకీతో తన తండ్రిని ఓ వ్యక్తి కాల్చేందుకు ప్రయత్నించాడని పేర్కొన్నారు. అయితే, భద్రతా సిబ్బంది అప్రమత్తతతో అది విఫలమైందన్నారు. ఫరూక్‌కు జెడ్ ప్లస్ భద్రత ఉన్న విషయాన్ని ఒమర్ ప్రస్తావించారు. ఇంత భద్రత ఉన్నా.. నిందితుడు అంత దగ్గరగా ఎలా రాగలిగాడని ప్రశ్నించారు. ఇక, భద్రతా వైఫల్యం కారణంగానే ఈ ఘటన చోటుచేసుకుందని ఉప ముఖ్యమంత్రి ఛౌదరి పేర్కొన్నారు.

# తిరిగి స్పీకర్ స్థానంలో విధులకు ఓంబిర్లా

## తనకు ఎలాంటి భేదభావాలు లేవని ప్రకటన

## నిబంధనల మేరకే నడచుకున్నానని వెల్లడి

**న్యూఢిల్లీ,మార్చి12 :** విపక్షాలు ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం వీగిపోయిన నేపథ్యంలో గురువారం లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా తిరిగి స్పీకర్ స్థానంలోకి వచ్చారు. అలాగే ఆయన తన పనితీరుపైనా స్పందించారు. ప్రతి ఎంపీకి లోక్‌సభలో మాట్లాడే అవకాశం కల్పించడానికి తాను ఎల్లప్పుడూ ప్రయత్నిస్తానని అన్నారు. సభ నియమ నిబంధనలకు ఎవరూ అతీతులు కారని లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీని ఉద్దేశించి వ్యాఖ్యలు చేశారు. ఎంపీల మైక్రోఫోన్లను నియంత్రించాననే ఆరోపణల్లో ఎలాంటి వాస్తవం లేదన్నారు. సభలో ఎవరికీ ప్రత్యేక వెసులుబాట్లు ఉండవు. నిబంధనల ప్రకారమే కార్యకలాపాలు నడుస్తాయి. ప్రధాని, మంత్రులు కూడా ఏవయినా ప్రకటనలు చేయడానికి ముందు సభ నిబంధనల ప్రకారం నోటీసులు ఇవ్వాలి. మైక్రోఫోన్లు ఆన్ లేక ఆఫ్ చేయడానికి స్పీకర్ వద్ద ఎలాంటి బటన్ ఉండదు. ఈ విషయం విపక్ష నేతలకు కూడా తెలుసు. మాట్లాడేందుకు అనుమతి ఉన్న సభ్యుడికి మాత్రమే మైక్రోఫోన్ ఆన్ అవుతుంది' అని తనపై విపక్షాలు కొంతకాలంగా చేస్తోన్న విమర్శలకు బిర్లా సమాధానం ఇచ్చారు. రెండ్రోజుల చర్చ అనంతరం బుధవారం సాయంత్రం విపక్షాలు ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానంపై ఓటింగ్ జరిగింది. మూజువాణి ఓటుతో అది వీగిపోయింది. రాష్ట్రపతికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చలో మాట్లాడేందుకు విపక్ష నేత రాహుల్‌గాంధీకి అవకాశం ఇవ్వకపోవడం, ఎనిమిది మంది సభ్యులపై సస్పెన్షన్ వేటు వేయడం, కాంగ్రెస్ మహిళా ఎంపీలపై నిరాధార ఆరోపణలు చేసిన భాజపా ఎంపీ నిశికాంత్ దుబెపై చర్యలు చేపట్టకపోవడం వంటి కారణాలతో విపక్షాలు ఈ అవిశ్వాస తీర్మానాన్ని తీసుకొచ్చిన సంగతి తెలిసిందే. తనపై ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం పక్రియ పూర్తయ్యేవరకు సభకు హాజరుకాకూడదని నిర్ణయించుకున్న స్పీకర్ అది వీగిపోగానే మళ్లీ యథావిధిగా తన బాధ్యతలు చేపట్టారు.

# దేశంలో ఇంధన కొరత లేదు

## తగినన్ని క్రూడాయిల్ నిల్వలు ఉన్నాయి

## రిఫైనరీలు పూర్తిస్థాయిలో పనిచేస్తున్నాయి

## ఎలాంటి సంక్షోభాన్ని అయినా ఎదుర్కొంటాం

## లోక్‌సభలో కేంద్రమంత్రి హర్దీప్ పురి సింగ్ ప్రకటన

## మంత్రిని హేళన చేస్తూ ఎన్‌స్టీన్ ఫైళ్ల ప్రస్తావనతో గందరగోళం



**న్యూఢిల్లీ,మార్చి12 :** పశ్చిమాసియా ఉద్రిక్తతల వేళ దేశంలో ఇంధన భయాలు నెలకొన్నాయి. ఈ క్రమంలో గురువారం ఎల్‌పీజీ అంశంపై లోక్‌సభలో వాడీవేడి చర్చ జరిగింది. చర్చలో కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ ఎప్‌స్టీన్ ఫైళ్ల ప్రస్తావన తీసుకురావడంతో తీవ్ర గందరగోళం ఏర్పడింది. అయితే ఇంధన

కొరతపై కేంద్రమంత్రి నిరసనల మధ్యే తన ప్రకటన చేశారు. భారత్‌లో ఇంధన కొరత లేదని, తగినన్ని క్రూడాయిల్ నిల్వలు ఉన్నాయని కేంద్ర పెట్రోలియం, సహజ వాయువుల శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పురి తెలిపారు. పెట్రోల్, డీజిల్, విమాన ఇంధన సరఫరాలో ఎలాంటి కొరత లేదని చెప్పారు. దేశీయ రిఫైనరీలు పూర్తి సామర్థ్యంతో పనిచేస్తున్నాయని అన్నారు. ప్రజలు ఎలాంటి వదంతులు వ్యాప్తి చేయవద్దని కోరారు. పశ్చిమాసియాలో ఉద్రిక్తతల నేపథ్యంలో దేశంలో ఎల్‌పీజీ లభ్యతపై ఆందోళన నెలకొనడంతో కేంద్ర మంత్రి లోక్‌సభలో మాట్లాడారు. 'ఆధునిక ఇంధన చరిత్రలో ప్రపంచం ఇలాంటి క్లిష్ట సమయాన్ని మునుపెన్నడూ ఎదుర్కోలేదు. భారత్ తన ముడి చమురు అవసరాల కోసం సురక్షితమైన సరఫరాలను సమకూర్చుకుంది. హర్మూజ్ సంక్షోభంతో భారత్‌కు సంబంధం లేదు. హర్మూజ్ జలసంధి భారత్‌కు తెరిచారు. ప్రధానమంత్రి చర్చలతో పరిస్థితులు సర్దుకుంటున్నాయి' అని హర్దీప్ సింగ్ తెలిపారు. ఎలాంటి సంక్షోభం తలెత్తినా ఎదుర్కొనేందుకు కూడా కేంద్రం సిద్ధంగా ఉందని చెప్పారు. డొమెస్టిక్ సిలిండర్ల సరఫరాకు ఎలాంటి ఇబ్బందులు లేవని మంత్రి వివరించారు. సిలిండర్ల సరఫరాలో ఆసుపత్రులు, విద్యాసంస్థలకు ప్రాధాన్యత ఇస్తున్నట్టు చెప్పారు. సిలిండర్ బుకింగ్‌కు నగరాల్లో 25 రోజుల వ్యవధి, గ్రామాల్లో 45 రోజుల వ్యవధి అమలు చేస్తున్నట్టు చెప్పారు. ఎల్ఎన్‌జీ కార్గోలు దాదాపు ప్రతిరోజూ ప్రత్యామ్నాయ సరఫరా రూట్లలో ఇండియాకు వస్తున్నాయని తెలిపారు. ఒకవేళ ఘర్షణలు సుదీర్ఘకాలం కొనసాగినప్పటికీ తగినంత గ్యాస్ ఉత్పత్తి, సరఫరా ఏర్పాట్లు చేయగలిగే స్థితిలో ఇండియా ఉందని అన్నారు. గృహాలు, పరిశ్రమలకు అవసరమైన విద్యుత్ ఉత్పత్తికి ఎలాంటి ఇబ్బంది లేదని చెప్పారు. రిఫైనరీలకు తగిన ఆదేశాలు ఇవ్వడం ద్వారా గత ఐదు రోజులుగా 28 శాతం ఎల్పీజీ ఉత్పత్తి పెరిగినట్టు హర్దీప్ సింగ్ పురి తెలిపారు. లక్షలాది భారతీయ కుటుంబాల వంటిళ్లలో ఎలాంటి కొరత లేకుండా చూసేందుకు మోదీ ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యం ఇస్తోందని, డొమిస్టిక్ సప్లయ్‌కు పూర్తి భరోసా ఉందని చెప్పారు. ప్రధాని మోదీ చర్చల వల్ల పరిస్థితులు సర్దుకుంటున్నాయి. పెట్రోల్, డీజిల్, ఏటీఎఫ్ సరఫరాలో ఎలాంటి కొరత లేదు. దేశీయ రిఫైనరీలు పూర్తి సామర్థ్యంతో పనిచేస్తున్నాయి. గృహ వినియోగ సిలిండర్ల సరఫరాకు ఇబ్బందులు లేవు. 60 శాతం ఎల్‌పీజీని మనం గల్ఫ్ దేశాల నుంచి దిగుమతి చేసుకుంటున్నాం. సిలిండర్ల సరఫరాలో ఆస్పత్రులు, విద్యాసంస్థలకు ప్రాధాన్యత ఇస్తున్నాం. సిలిండర్ బుకింగ్‌కు నగరాల్లో 25, గ్రామాల్లో 45 రోజుల గడువు విధించాం. ప్రపంచం ఇలాంటి ఇంధన సంక్షోభాన్ని ఎన్నడూ చూడలేదు. ఇతర దేశాలతో పోలిస్తే భారత్ పరిస్థితి మెరుగ్గా ఉందని తెలిపారు. మంత్రి మాట్లాడుతుండగానే రాహుల్ గాంధీ, ప్రియాంకా గాంధీ సభ నుంచి వెళ్లిపోయారు.

# ఇంధన భద్రతపై ఇరాన్‌తో చర్చిస్తున్నాం

## ఇప్పటికే ఇరాన్‌తో మంత్రి జైశంకర్ చర్చలు

## విదేశాంగశాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్

**న్యూఢిల్లీ,మార్చి12 :** ఇంధన భద్రతపై ఇరాన్‌తో చర్చిస్తున్నాం విదేశాంగశాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ అన్నారు. దేశ ఇంధన భద్రతపై ఇరాన్‌తో విదేశాంగశాఖ మంత్రి జైశంకర్ మాట్లాడారని రణధీర్ జైస్వాల్ వెల్లడించారు. హర్మూజ్ మీదుగా భారత్‌కు వచ్చే నౌకల ప్రయాణం గురించి కూడా చర్చించినట్లు తెలిపారు. మరోవైపు, డీజిల్ సరఫరా కోసం బంగ్లాదేశ్ ప్రభుత్వం విజ్ఞప్తి చేసిందని, దానిని పరిశీలిస్తున్నట్లు చెప్పారు. శ్రీలంక, మాల్దీవుల నుంచీ ఇదే తరహా అభ్యర్థనలు వచ్చాయని, అయితే.. ముందుగా మన దేశ అవసరాలను కేంద్రం పరిగణనలోకి తీసుకుంటుందన్నారు. ప్రస్తుతం ఇరాన్‌లో దాదాపు తొమ్మిది వేల మంది భారతీయులు ఉన్నారని.. వీరిలో విద్యార్థులు, నౌకా సిబ్బంది, వ్యాపారవేత్తలు, యాత్రికులు ఉన్నట్లు విదేశాంగశాఖ అధికార ప్రతినిధి వెల్లడించారు. ఘర్షణ మొదలైన వెంటనే విద్యార్థులు సహా అనేక మంది భారతీయులను సురక్షిత ప్రాంతాలకు తరలించామన్నారు. స్వదేశానికి తిరిగి రావాలనుకునే భారతీయులందరికీ సౌకర్యాలు కల్పిస్తున్నామన్నారు. మన రాయబార కార్యాలయం అన్ని సమయాల్లో అందుబాటులో ఉందన్నారు. అఫ్గాన్‌తో ఇటీవల ఘర్షణకు భారత్ కారణమంటూ పాకిస్థాన్ చేసిన ఆరోపణలను భారత విదేశాంగశాఖ ఖండించింది. అవి నిరాధార ఆరోపణలని స్పష్టం చేసింది. తన తప్పిదాలను కప్పిపుచ్చుకునేందుకు భారత్‌పై నిందలు వేయడం పాకిస్థాన్‌కు పరిపాటేనని విమర్శించింది. దశాబ్దాలుగా సీమాంతర ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తున్న దాయాది దేశం మాటలకు విశ్వసనీయత లేదని తెలిపింది.

# మన విదేశాంగ విధానం అమెరికాకు తాకట్టు

## ఎవరి నుంచి చమురు కొనాలో అమెరికా పెత్తనం ఏంటి

## ఎన్‌స్టీన్ ఫైల్స్‌లో దొరికి పోవడంతోనే అమెరికాకు దాసోహం

## లోక్‌సభలో రాహుల్ గాంధీ ఘాటు విమర్శలు




**న్యూఢిల్లీ,మార్చి12 :** భారత విదేశాంగ విధానన్ని మోడీ అమెరికాకు తకట్టు పెట్టారని విపక్షనేత రాహుల్ గాంధీ మండిపడ్డారు. రష్యా నుంచి చమురు దిగుమతులకు అమెరికా అడ్డంకులేంటని ప్రశ్నించారు. మనం చమురు ఎక్కడ కొనాలో అమెరికా నిర్ణయిస్తుందంటే మన విదేశాంగ విధానం తాకట్టు పెట్టినట్లేనని అన్నారు. హర్మూజ్ జలసంధి నుంచి పెద్ద ఎత్తున దిగుమతులు జరగాల్సి ఉంది. యుద్ధం కారణంగా దిగుమతులు ఆగిపోయాయి. ఇది ఆరంభం మాత్రమే. గ్యాస్ కొరతతో దేశం అల్లాడుతోంది. మనం ఎవరి నుంచి చమురు కొనాలో అమెరికా నిర్ణయిస్తోంది. రష్యా నుంచి చమురు కొనాలో..?వద్దో..? మనకు మనం నిర్ణయించుకోవాలి. రష్యా నుంచి చమురు కొనుగోలుపై అమెరికా జోక్యం ఎందుకు..? భారత్ వంటి పెద్ద దేశానికి మరోదేశం అనుమతి ఎందుకు..? ఇలా ఎందుకు జరుగుతోందా అని ఆలోచించాను. నా ప్రశ్నకు సమాధానం ఎప్‌స్టీన్ ఫైల్స్ రూపంలో దొరికింది. ఎప్‌స్టీన్ ఫైళ్ల ప్రభావం ఎల్‌పీజీ దిగుమతులపై పడినట్లు ఉంది. ఎప్‌స్టీన్‌తో సంబంధాలను పెట్రోలియం మంత్రే అంగీకరించారని రాహుల్ వ్యాఖ్యలు చేశారు. ఇవి దుమారం రేపాయి. దీంతో స్పీకర్ ఓం బిర్లా స్పందించారు. నోటీసు ఇచ్చిన అంశంపైనే మాట్లాడాలని సూచించారు. సభ్యుల ఇష్టాఇష్టాల మేరకు సభ నడవదని స్పష్టం చేశారు. ఇదే అంశంపై పెట్రోలియం శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పురీ ప్రసంగాన్ని విపక్షాలు అడ్డుకున్నాయి. ఎప్‌స్టీన్ అంటూ లోక్‌సభలో విపక్ష సభ్యులు నినాదాలు చేశారు. ఆ గందరగోళం మధ్యే మంత్రి మాట్లాడారు. ఇరాన్, అమెరికా - ఇజ్రాయిల్ యుద్ధం నేపథ్యంలో గ్యాస్ కొరతతో భారతదేశం అల్లాడుతోందని రాహుల్ గాంధీ ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలో ప్రస్తుత పరిస్థితికి మోదీ ప్రభుత్వమే కారణమని ఆయన విమర్శించారు. పశ్చిమాసియాలో యుద్ధం జరుగుతుందన్నారు. అమెరికా - ఇజ్రాయిల్, ఇరాన్ యుద్ధంలో ఉన్నాయని పేర్కొన్నారు. ప్రపంచ దేశాలకు 20 శాతం చమురు హార్మూజ్ జల సంధి నుంచి వస్తుందని వివరించారు. ప్రస్తుతం ఆ జల సంధిని మూసివేశారని పేర్కొన్నారు. గ్యాస్ కొరత కారణంగా దేశవ్యాప్తంగా రెస్టారెంట్లు మూతపడ్డాయని చెప్పారు. ఎల్పీజీ గ్యాస్ కొరత నేపథ్యంలో ప్రజలు భయాందోళనలో ఉన్నారన్నారు. దేశానికి పునాది ఇంధన భద్రత అని అభివర్ణించారు. భారత్ వ్యవహారాలను అమెరికా శాసిస్తోందని మండిపడ్డారు. యూఎస్ అనుమతి లేకుంటే ముడి చమురు కొనుగోలు చేయ్యారా? అంటూ వ్యంగ్యంగా కేంద్రాన్ని నిలదీశారు. భారత్ వంటి పెద్ద దేశానికి మరో దేశం అనుమతి అవసరమా? అంటూ సందేహం వ్యక్తం చేశారు. పెట్రోలియం మంత్రికి ఎప్‌స్టీన్‌తో సంబంధాలున్నాయని ఆరోపించారు. ఈ వ్యాఖ్యలు చేసిన వెంటనే రాహుల్ మైక్‌ను స్పీకర్ ఓం బిర్లా కట్ చేశారు. అంతలో సభలోని హర్దీప్ సింగ్ స్పందిస్తూ.. రాహుల్ గాంధీ వ్యాఖ్యలపై అభ్యంతరం వ్యక్తం చేశారు. హర్దీప్‌సింగ్ ప్రసంగాన్ని విపక్షాలు అడ్డుకున్నాయి. అంతే కాకుండా ఎప్‌స్టీన్ అంటూ సభలో విపక్ష పార్టీల సభ్యులు బిగ్గరగా నినాదాలు చేశారు. అనంతరం సభను వాయిదా వేస్తున్నట్లు స్పీకర్ ఓం బిర్లా ప్రకటించారు.

# ఎల్పీజీ గ్యాస్ సిలిండర్ల కొరతపై మోడీ మౌనం

## పార్లమెంటులో చర్చించాలన్న ఎంపి చామల

qÖ¬gó©¢,eÖ/Ì12 : ఎల్పీజీ గ్యాస్ సిలిండర్ల కొరతపై ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఎందుకు మాట్లాడటం లేదని కాంగ్రెస్ భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి ప్రశ్నించారు. పశ్చిమాసియా దేశాల్లో జరుగుతున్న యుద్ధంపై పార్లమెంట్‌లో ఎందుకు చర్చించడం లేదని నిలదీశారు. ఎల్పీజీ సమస్యను కేంద్రప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఎంపీ కిరణ్ కుమార్ రెడ్డి డిమాండ్ చేశారు. 18వ లోక్‌సభలో కేంద్రప్రభుత్వం వాస్తవాలు మాట్లాడనీయడం లేదని ధ్వజమెత్తారు. ప్రతిపక్షాల గొంతు నొక్కడం మోదీ ప్రభుత్వ అజెండాగా మారిందని ఆగ్రహించారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మాట్లాడే మాటలను నరేంద్రమోదీ మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. ట్రంప్ చర్యలను మోదీ ఎందుకు వ్యతిరేకించడం లేదని ప్రశ్నల వర్షం కురిపించారు. ట్రంప్‌నకు మోదీ ఎందుకు భయపడుతున్నారో అర్థం కావడం లేదని అన్నారు. పశ్చిమాసియా దేశాల్లో యుద్ధ పరిస్థితులు, ప్రభావంపై ప్రధాని నరేంద్రమోదీ పార్లమెంట్‌లో మాట్లాడాలని ఎంపీ కిరణ్ కుమార్ రెడ్డి డిమాండ్ చేశారు. ఎల్పీజీ సిలిండర్ ధరల పెరుగుదల, కొరతపై పార్లమెంట్ మకర్ ద్వార్ వద్ద ఇండియా కూటమి ఎంపీలు నిరసన వ్యక్తం చేశారు. కట్టెల పొయ్యిలు, వంట పాత్రలు, ఎల్పీజీ సిలిండర్ల పోస్టర్లతో నిరసనకు దిగారు. విపక్షాల ఆందోళనలో ఏఐసీసీ అగ్రనేతలు మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ వాద్రా, ఇండియా కూటమి ఎంపీలు పాల్గొన్నారు. ఈ ధర్నాలో కాంగ్రెస్ భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి పాల్గొని ప్రసంగించారు.

# భారత క్రికెట్ జట్టు మెగా షెడ్యూల్

**మరో రెండు కొత్త సిరీస్‌లపై చర్చలు!**

**ఈ ఏడాది టీమిండియా ఫుల్ బిజీ**

**శ్రీలంక, ఐర్లాండ్‌లో అదనపు టీ20 సిరీస్‌లు ఆడేందుకు బీసీసీఐ ప్రణాళిక**

**వరద బాధితుల సహాయ నిధి కోసం మూడు టీ20ల సిరీస్ కు లంక ప్రతిపాదన**

**ఇంగ్లండ్ పర్యటనకు ముందు ఐర్లాండ్‌తో సిరీస్‌పై చర్చలు!**



రానున్న 12 నెలల పాటు అత్యంత బిజీ షెడ్యూల్‌తో ఉన్న టీ20 ప్రపంచ ఛాంపియన్ భారత్... ఈ సీజన్ లో మరో రెండు అదనపు టీ20 సిరీస్‌లు ఆడే అవకాశం కనిపిస్తోంది. ఇప్పటికే పలు ద్వైపాక్షిక సిరీస్‌లు, టోర్నమెంట్‌లు ఖరారైన నేపథ్యంలో శ్రీలంక, ఐర్లాండ్‌లలో పొట్టి ఫార్మాట్ సిరీస్‌లు ఆడే ప్రతిపాదనలను భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) పరిశీలిస్తున్నట్లు నివేదికలు చెబుతున్నాయి. తాజా సమాచారం ప్రకారం, శ్రీలంక పర్యటనలో భాగంగా రెండు టెస్టులకు ముందు మూడు టీ20 మ్యాచ్‌లు నిర్వహించాలని బీసీసీఐ యోచిస్తోంది. జూలై–ఆగస్టు నెలల్లో ఈ మ్యాచ్‌లు జరగవచ్చు. గతేడాది నవంబర్‌లో వచ్చిన 'దిత్వా' తుపాను కారణంగా శ్రీలంక తీవ్రంగా నష్టపోయింది. ఈ నేపథ్యంలో వరద బాధితుల సహాయ నిధి కోసం ఈ టీ20 సిరీస్‌ను నిర్వహించాలని శ్రీలంక క్రికెట్ (ఎస్ఎల్ సీ) బోర్డు బీసీసీఐని కోరినట్లు తెలిసింది. ఈ ప్రతిపాదన కార్యరూపం దాల్చితే, సూర్యకుమార్ యాదవ్ నేతృత్వంలోని భారత టీ20 జట్టు ముందుగా ఈ సిరీస్ ఆడి, ఆ తర్వాత టెస్టు మ్యాచ్‌లలో పాల్గొంటుంది. మరోవైపు, ఇంగ్లండ్ పర్యటనకు వెళ్లే ముందు ఐర్లాండ్‌లో కూడా టీమిండియా పర్యటించే అవకాశాలున్నాయి. జూన్ చివరి వారంలో డబ్లిన్‌లో 3 మ్యాచ్‌ల టీ20 సిరీస్ నిర్వహించడంపై బీసీసీఐ, క్రికెట్ ఐర్లాండ్ మధ్య చర్చలు జరుగుతున్నట్లు సమాచారం. ఈ చర్చలు సఫలమయ్యే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని తెలుస్తోంది. ఐర్లాండ్‌లో క్రికెట్ అభివృద్ధికి మద్దతుగా భారత్ గతంలో 2018, 2022, 2023 సంవత్సరాల్లో కూడా పర్యటించింది. జూన్ 6 నుంచి 20 వరకు ఆఫ్ఘనిస్థాన్‌తో స్వదేశంలో ఒక టెస్టు, మూడు వన్డేల సిరీస్ ఆడనున్న భారత్.. ఆ తర్వాత ఈ అదనపు సిరీస్‌లలో పాల్గొని, జూలై 1 నుంచి 19 వరకు ఇంగ్లండ్‌లో మూడు వన్డేలు, ఐదు టీ20ల సిరీస్‌లో తలపడనుంది. ఈ కొత్త సిరీస్‌లు కూడా ఖరారైతే టీమిండియా షెడ్యూల్ మరింత బిజీగా మారనుంది.



# టీ20 టీమ్ కెప్టెన్‌గా సంజూ శాంసన్..?

సొంతగడ్డపై టీ20 ప్రపంచకప్ గెలుపుతో టీమిండియా సంబరాల్లో మునిగిపోయింది. మూడుసార్లు టీ20 వరల్డ్ కప్ గెలిచిన తొలి జట్టుగా భారత్ నిలవగా.. సొంతగడ్డపై టైటిల్ గెలిచిన మొదటి జట్టుగా రికార్డు క్రియేట్ చేసింది. 2024 వరల్డ్ కప్ విజయం తరువాత రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ వంటి స్టార్లు రిటైర్‌మెంట్ ప్రకటనతో యువ జట్టు ఎలా ఆడుతుందో అని అనుమానాలు ఉన్నా.. అన్ని ఫటాపంచల్ చేస్తూ విశ్వవిజేతగా నిలిచింది. రోహిత్ శర్మ నుంచి టీ20 పగ్గాలు అందుకున్న సూర్యకుమార్ యాదవ్.. ఇప్పటివరకు ఒక్క సిరీస్ కూడా ఓడిపోని కెప్టెన్‌గా కొనసాగుతున్నాడు. ఆసియా కప్, టీ20 ప్రపంచకప్ గెలిపించిన కెప్టెన్‌గా నిలిచాడు. ఇక భవిష్యత్ ప్లానింగ్స్ గురించి ప్రస్తుతం చర్చలు మొదలయ్యాయి. ప్రస్తుతం సూర్యకుమార్ యాదవ్ 35 ఏళ్లు కాగా.. 2028 లాస్ ఏంజిల్స్ ఒలింపిక్స్, వచ్చే వరల్డ్ కప్ (2028) నాటికి సూర్యకు 37 ఏళ్లు వస్తాయి. అప్పటివరకు టీమ్‌లో ఉన్నా.. కెప్టెన్‌గా కొనసాగుతాడా లేదా అనేది అనుమానమే. ప్రస్తుతం ఉన్న టీమ్‌లో కెప్టెన్సీ రేసులో చాలామంది పేర్లు వినిపిస్తున్నాయి. ముందు వరుసలో మాత్రం సంజూ శాంసన్ పేరు మారుమోగిపోతుంది. టీ20 వరల్డ్ కప్ సూపర్–8 ఆఖరి మ్యాచ్ నుంచి ఫైనల్ మ్యాచ్ వరకు హ్యాట్రిక్ హాఫ్ సెంచరీలతో భారత్ విశ్వవిజేతగా నిలవడంలో కీలక పాత్ర పోషించాడు. ఐపీఎల్‌లో రాజస్థాన్ రాయల్స్ టీమ్‌కు కెప్టెన్‌గా పని చేసిన అనుభవం ఉండడం.. టీమ్‌లో సీనియర్ ప్లేయర్ కావడంతో సూర్యకు సరైన వారసుడు సంజూనే అని మాజీలు విశ్లేషిస్తున్నారు. కొత్త కెప్టెన్సీ అంశంపై భారత మాజీ క్రికెటర్ మొహమ్మద్ కైఫ్ మాట్లాడుతూ.. టీ20 అంతర్జాతీయ క్రికెట్‌లో టీమిండియా కెప్టెన్సీకి సంజూ శాంసన్ బలమైన పోటీదారుడని చెప్పాడు. సంజూకు కెప్టెన్ ఉండాల్సిన అనుభవం, అవగాహన ఉందని అన్నాడు. క్లిష్ట సమయాల్లో కూడా ఎలాంటి టెన్షన్ లేకుండా సంజూ నిర్ణయాలు తీసుకోగలడని పేర్కొన్నాడు. సూర్య తరువాత కొత్త కెప్టెన్ ఎవరు అని ఇప్పుడే చెప్పడం కష్టమైనా.. సంజూ మాత్రం ముందు వరుసలో ఉంటాడని అన్నాడు. కెప్టెన్ ప్రపంచాన్ని చూసిన వ్యక్తి అయి ఉండాలని.. బౌలింగ్‌లో మార్పులు.. సరైన ప్లేయర్లను తుది జట్టులో ఆడించడం.. ఫామ్‌లో లేని ఆటగాళ్లకు మద్దతుగా ఉండడం ఇవన్నీ ఆటలో భాగమని కెప్టెన్‌గా తెలిసి ఉండాలన్నాడు. "సంజూ కచ్చితంగా కెప్టెన్సీ రేసులో ఉంటాడని నేను భావిస్తున్నాను. సూర్య రిటైర్‌మెంటె ప్రకటిస్తే.. సంజూ ఆ స్థానాన్ని భర్తీ చేయగలడు. ఐపీఎల్‌లో చాలా మ్యాచ్‌లకు కెప్టెన్‌గా వ్యవహరించాడు. రాజస్థాన్ రాయల్స్‌ను 2022 ఫైనల్‌కు నడిపించాడు. సంజూ వయస్సు కేవలం 31 సంవత్సరాలు. టీమిండియా తదుపరి కెప్టెన్ కావచ్చు" అని కైఫ్ చెప్పుకొచ్చాడు. ప్రస్తుతం టీమ్‌లో ఉన్న వారిలో హార్దిక్ పాండ్యాకు కెప్టెన్సీ బాధ్యతలు అప్పగించి.. మళ్లీ తీసేశారు. వైస్ కెప్టెన్‌గా ఉన్న అక్షర్ పటేల్‌కు కెప్టెన్సీ బాధ్యతలు అప్పగించే అవకాశాలు తక్కువే. మిగిలిన వారందరితో పోల్చినా.. సంజూనే బెస్ట్ ఆప్షన్‌గా కనిపిస్తున్నాడని ఇతర మాజీ ప్లేయర్లు కూడా అంటున్నారు.

# మాజీ క్రికెటర్ కీర్తి ఆజాద్‌పై గంభీర్ ఆగ్రహం



భారత క్రికెట్ జట్టు టీ20 ప్రపంచకప్ గెలిచిన తర్వాత ట్రోఫీతో ఆలయానికి వెళ్లడంపై వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన మాజీ క్రికెటర్, ఎంపీ కీర్తి ఆజాద్?పై హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ తీవ్రంగా స్పందించారు. ఈ వ్యాఖ్యలు చేయడం ద్వారా ఆయన తమ జట్టు ఆటగాళ్లనే అవమానపరుస్తున్నారని అన్నారు. కీర్తి ఆజాద్ చేసిన వ్యాఖ్యలకు స్పందించడం కూడా అవసరం లేదన్నారు. ఓ వార్త సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో గంభీర్ ఈ మేరకు వ్యాఖ్యలు చేశారు. 'ఇలాంటి వ్యాఖ్యలు చేయడం సరైంది కాదు. ఇది దేశానికి ఓ గొప్ప క్షణం. ప్రపంచకప్ విజయాన్ని సంబరంగా జరపుకోవడం ముఖ్యమని నేను భావిస్తున్నా. ఇలాంటి వ్యాఖ్యలు చేయడం వల్ల ఆటగాళ్ల సాధనను తగ్గించే ప్రయత్నం చేసినట్టే అవుతుంది. దక్షిణాఫ్రికాతో మ్యాచ్ ఓడిన తర్వాత జట్టు ఒత్తిడిని ఎదుర్కొంది. ఆ ఒత్తిడిని దాటుకుని ఆటగాళ్లు సాధించిన విజయాన్ని తక్కువ చేసి చూపడం సరైంది కాదు' అని గంభీర్ తెలిపారు. ఇక భారత్?లో క్రికెట్? పిచ్?లను సొంత జట్టుకు అనుకూలంగా ప్రత్యేకంగా తయారు చేస్తారనే విమర్శలను గంభీర్ తీవ్రంగా ఖండించారు. ఇలాంటి ఆరోపణలు కేవలం వివాదాలు సృష్టించేందుకు, ఆకర్షించడానికి, టీఆర్?పీలు పొందేందుకు తరుచుగా చేస్తున్నవేనని అన్నారు. అలాగే టీ20 ప్రపంచకప్‌లో భారత్ భారీ స్కోర్లు నమోదు చేసిన విషయంపై వచ్చిన విమర్శలకు స్పందిస్తూ గంభీర్ ఈ వ్యాఖ్యలు చేశారు.'భారత్? జట్టు ఎంతో బలమైనది. అలాంటి పనులు చేయాల్సిన అవసరం లేదు. టీ20 ఫార్మాట్‌లో మేం ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా వంటి విదేశీ పరిస్థితుల్లో కూడా 200 పరుగులు చేశాం. అదే స్కోరు భారత్‌లో చేస్తే పిచ్‌లను మార్చారని అంటారు. టీ20 ప్రపంచకప్ వంటి అంతర్జాతీయ టోర్నీల్లో పిచ్‌లను భారత క్రికెట్ బోర్డు నియంత్రించదు. ఇలాంటి టోర్నీల్లో పిచ్?ల నిర్వహణ అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్? చేతుల్లోనే ఉంటుంది. అందువల్ల భారత్‌కు అనుకూలంగా పిచ్‌లను తయారు చేశారనే ఆరోపణలకు అర్థం లేదు. ప్రపంచవ్యాప్తంగా టీ20 మ్యాచ్‌ల్లో భారీ స్కోర్లు సాధారణంగా మారాయి. ఇది కేవలం భారత్?లో జరుగుతున్న విషయం కాదు' అని గంభీర్ అన్నారు. తాను కోచ్?గా నిర్ణయాలు తీసుకునేటప్పుడు తన అంతర్మాతనే నమ్ముతారని గంభీర్? అన్నారు. తన నిర్ణయాల వెనక ప్రధాన కారణం తన నమ్మకం, జట్టుకు మంచిదని భావించిన తీర్పేనని చెప్పారు. డేటా లేదా ఇతర విషయాలను ఎక్కువగా చూడనని చెప్పారు. తన నిర్ణయం జట్టుకు సరైనదని అనిపిస్తే దానిపై పూర్తిగా నిలబడతారని, అది పనిచేయకపోతే బాధ్యతను స్వయంగా తానే స్వీకరిస్తానని చెప్పారు. జట్టు ఎలా ఆడాలి, వ్యవహరించాలి, మైదానం లోపల, వెలుపల ఎలా ప్రవర్తించాలి అనే విషయాల్లో తనకు ఉన్న ఆలోచనలే ప్రస్తుతం జట్టు అనుగుణంగా ఉంటాయని చెప్పారు. ఇక తన పని సూపర్? స్టార్లకు బదులుగా సూపర్ జట్టును నిర్మించాలనే తన ఉద్దేశం అని గంభీర్ అన్నారు. ప్రసారా, సోషల్ మీడియా, టీఆర్?పీలు, అభిమానుల ఫాలోయింగ్ గురించి తాను పట్టించుకోనని చెప్పారు. కానీ ఆటగాళ్ల జట్టుకు, దేశానికి ఏం తీసుకవస్తారనే దానిపై దృష్టి పెడరతానని అన్నారు. 'మీడియా సూపర్ స్టార్లను సృష్టించాలని కోరుకుంటుంది. కానీ హెడ్ కోచ్‌గా నా పని ఒక సూపర్ టీమ్‌ను సృష్టించడం. నా వృత్తిని నేను చూసే ఏకైక మార్గం అదే. ఎందుకంటే నా ఉద్యోగం పూర్తిగా న్యాయంగా ఉండటం. అలాగే అందరినీ సమానంగా చూడటం. ఆ డ్రెస్సింగ్ రూమ్‌లోని ఆ 15 మంది నాకు పూర్తిగా సమానం' అని గంభీర్ తెలిపారు.



# బ్యాటింగ్ లెజెండ్ ద్రవిడ్‌కు లైఫ్ టైమ్ అచీవ్ మెంట్ పురస్కారం!

**క్రికెటర్ ఆఫ్ ది ఇయర్‌గా శుభ్‌మన్ గిల్ ఎంపిక**

**టీ20 ప్రపంచకప్ విజేతలతో పాటు పలు జట్లకు సత్కారం**

**దేశవాళీ క్రికెట్‌లో ఉత్తమ సంఘంగా ముంబై క్రికెట్ అసోసియేషన్**

**మార్చి 15న ఢిల్లీలో బీసీసీఐ 'నమన్' అవార్డుల ప్రదానం**


భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) వార్షిక అవార్డుల ప్రదానోత్సవానికి రంగం సిద్ధమైంది. ఈ నెల 15న దేశ రాజధాని ఢిల్లీలో 'నమన్' పేరుతో జరగనున్న ఈ కార్యక్రమంలో భారత బ్యాటింగ్ దిగ్గజం, మాజీ హెడ్ కోచ్ రాహుల్ ద్రవిడ్‌కు ప్రతిష్ఠాత్మక కల్నల్ సీకే నాయుడు జీవిత సాఫల్య పురస్కారం లభించనుంది. అదేవిధంగా, భారత టెస్టు, వన్డే కెప్టెన్ శుభ్‌మన్ గిల్‌ను 'ఉత్తమ అంతర్జాతీయ క్రికెటర్' (పాలి ఉమ్రిగర్ అవార్డు) విభాగంలో ఎంపిక చేసినట్టు తెలుస్తోంది. భారత క్రికెట్‌కు చేసిన సేవలకు గుర్తింపుగా ద్రవిడ్‌ను లైఫ్ టైమ్ అచీవ్ మెంట్ పురస్కారానికి ఎంపిక చేశారు. ఆయన మార్గనిర్దేశంలోనే భారత్ 2024 టీ20 ప్రపంచకప్ గెలిచిన సంగతి తెలిసిందే. మరోవైపు, 2025లో టెస్టుల్లో 983 పరుగులు, వన్డేల్లో 490 పరుగులతో అద్భుత ప్రదర్శన కనబరిచిన శుభ్‌మన్ గిల్‌కు 'క్రికెటర్ ఆఫ్ ది ఇయర్' గౌరవం దక్కనుంది. టీ20 ప్రపంచకప్ జట్టులో గిల్ సభ్యుడు కానప్పటికీ, టెస్టులు, వన్డేల్లో నిలకడైన ప్రదర్శనతో ఈ అవార్డుకు ఎంపికయ్యాడు. ఈ వేడుకలో... ఇటీవల టీ20 ప్రపంచకప్ గెలిచిన భారత పురుషుల జట్టు, 2025 ఛాంపియన్స్ ట్రోఫీ, 2025 మహిళల వన్డే ప్రపంచకప్ గెలిచిన జట్లతో పాటు అండర్–19 ప్రపంచకప్ విజేతలను కూడా బీసీసీఐ సత్కరించనుంది. అయితే, ఇదే రోజున దేశవాళీ టోర్నీల ఫైనల్స్ ఉండటంతో కొంతమంది మహిళా క్రికెటర్లు ఈ కార్యక్రమానికి హాజరుకాలేకపోవచ్చని సమాచారం. దేశవాళీ క్రికెట్‌లో ఉత్తమ పనితీరు కనబరిచిన అసోసియేషన్ గా ముంబై క్రికెట్ అసోసియేషన్ వరుసగా మూడోసారి అవార్డు అందుకోనుంది. వీరితో పాటు రంజీ ట్రోఫీలో అత్యధిక పరుగులు, వికెట్లు తీసిన యశ్ రాథోడ్, యశ్ దూబేలకు మాధవరావు సింధియా అవార్డులు, ఉత్తమ అంపైర్‌గా ఉల్హాస్ గాంధే తదితరులకు కూడా పురస్కారాలు ప్రదానం చేయనున్నారు.

# స్పిన్నర్ వరుణ్ చక్రవర్తి అగ్రస్థానం గల్లంతు

గతకొన్ని రోజులుగా బౌలింగ్ విభాగంలో టాప్‌లో కొనసాగిన టీమ్ఇండియా స్పిన్నర్ వరుణ్ చక్రవర్తి అగ్రస్థానం గల్లంతైంది. ఈ టోర్నీలో పేలవ ఫామ్ కొనసాగించిన వరుణ్ రెండో స్థానానికి పడిపోయాడు. అఫ్గానిస్థాన్ బౌలర్ రషీద్ ఖాన్ ఒక స్థానం మెరుగుపర్చుకొని 753 రేటింగ్స్‌తో టాప్ ప్లేస్‌లోకి దూకుకెళ్లాడు. వరుణ్ 740 రేటింగ్స్‌తో రెండో స్థానంలో కొనసాగుతున్నాడు. గతవారం 771 రేటింగ్స్‌తో టాప్‌లో ఉన్న వరుణ్ ఈవారం 31 పాయింట్లు కోల్పోయాడు. దీంతో వరల్డ్‌కప్ నెగ్గిన జోష్‌లో ఉన్న అతడికి ఒక రకంగా ఇది నిరాశే అని చెప్పవచ్చు!టీ20 వరల్డ్‌కప్ హీరో, టీమ్ఇండియా యంగ్ బ్యాటర్ సంజు శాంసన్ మరోసారి ఐసీసీ ర్యాంకింగ్స్‌లో సత్తా చాటాడు. ఈ టోర్నీలో అద్భుత ప్రదర్శనతో 'ప్లేయర్ ఆఫ్ ది టోర్నీ' అవార్డు దక్కించుకున్న అతడు, తాజా ర్యాకింగ్స్‌లో ఏకంగా 18 స్థానాలు మెరుగుపర్చుకున్నాడు. దీంతో ప్రస్తుతం అతడు 637 రేటింగ్ పాయింట్స్‌తో 22వ స్థానంలో కొనసాగుతున్నాడు. ఇక ఫైనల్‌లో న్యూజిలాండ్‌పై హాఫ్ సెంచరీ సాధించడంతో భారత ఓపెనర్ అభిషేక్ శర్మ తన అగ్రస్థానం పదిలంగా ఉంచుకున్నాడు. అదే మ్యాచ్‌లో అర్ధ శతకం చేసిన ఇషాన్ కిషన్ కూడా రెండు స్థానాలు మెరుగుపర్చుకొని రెండో స్థానానికి ఎగబాకాడు.టీ20 ర్యాంకింగ్స్‌లో టీమ్ఇండియా యువ ఆటగాళ్ల మధ్య తీవ్ర పోటీ ఏర్పడింది. తాజా ర్యాకింగ్స్‌లో 875 రేటింగ్స్‌తో అభిషేక్ టాప్‌లో ఉన్నప్పటికీ, 871 రేటింగ్స్‌తో ఇషాన్ కిషన్ అతడికి చాలా దగ్గరగా వచ్చాడు. కేవలం నాలుగు రేటింగ్స్ దూరంలో నిలిచి రెండో ప్లేస్‌లో కొనసాగుతున్నాడు. అయితే భారత్‌కు మరో రెండు నెలల దాకా టీ20 మ్యాచ్‌లు లేకపోవడం వల్ల వీళ్ల పాయింట్లు అలాగే ఉండనున్నాయి. కానీ అదే సమయంలో ఇతర దేశాలు ఆయా సిరీస్‌ల్లో ఆడనున్నాయి. దీంతో రానున్న రోజుల్లో ర్యాంకుల్లో మార్పులు జరిగే ఛాన్స్ ఉంది. సూపర్ 8లో వెస్టిండీస్ మ్యాచ్‌కు ముందు శాంసన్ టీ20 ర్యాకింగ్స్‌లో 65వ స్థానంలో ఉన్నాడు. అయితే ఆ మ్యాచ్‌లో వీరోచిత ఇన్నింగ్స్‌తో జట్టును గెలిపించిన తర్వాత అతడు ఏకంగా 25 స్థానాలు ఎగబాకి 40వ ర్యాంక్‌కు చేరుకున్నాడు. ఇక గతవారం సెమీఫైనల్‌లో ఇంగ్లాండ్, ఫైనల్‌లో కివీస్‌పై వరుస హాఫ్ సెంచరీలతో తాజాగా మరో 18 స్థానాలు మెరుగుపర్చుకొని 637 రేటింగ్స్‌తో ఇప్పుడు 22వ ర్యాంకుకు చేరుకున్నాడు. అయితే శాంసన్‌కు టీ20 కెరీర్‌లో ఇదే అత్యుత్తమమైన రేటింగ్ పాయింట్లు కావడం విశేషం.ఈ టోర్నీలో రాణించిన కివీస్ బ్యాటర్ టిమ్ సీఫెర్ట్ నాలుగు స్థానాలు ఎగబాకి ఆరో స్థానానికి చేరుకున్నాడు. అయితే టీమ్ఇండియా కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ మాత్రం రెండు ప్లేస్‌లు దిగజారి 9వ ర్యాంక్?కు పడిపోయాడు. అలాగే సెమీఫైనల్‌లో భారత్‌పై సెంచరీ చేసిన జాకబ్ బెతెల్ 17 స్థానాలు ఎగబాకి 16వ ర్యాంక్?కు చేరుకోగా, ఇంకో సెమీస్‌లో సౌతాఫ్రికాపై 33 బంతుల్లోనే శతకం బాదిన ఫిన్ అలెన్ 7 ప్లేస్?లు మెరుగుపడి 20వ స్థానం దక్కించుకున్నాడు.



# డిఫరెంట్‌గా దీవానా మూవీ టీజర్




టాలీవుడ్ యువ నటుడు హర్షిత్ రెడ్డి హీరోగా, స్నేహ మ-ణిమేగలై హీరోయిన్‌గా నటిస్తున్న చిత్రం 'దీవాన'. ఈ చిత్ర టీజర్‌ను నేడు విడుదల చేశారు మేకర్స్. టీజర్ ఆరంభం నుంచి ముగింపు వరకు చాలా ఇంటెన్స్‌గా సాగింది. ఒక యువకుడు ప్రేమలో పడి, ఆ ప్రేమ కోసం ఏ స్థాయికైనా వెళ్లే 'దీవాన' గా ఎలా మారాడనేది ఈ చిత్ర ప్రధానాంశం. ముఖ్యంగా ఎంత అందంగా ఉంటే అంత సతాయిస్తారురా పోరీలు‘ మరియు ‘అది నీ ప్రాణం పీక్క తినకపోతే నన్ను అడుగురా‘ వంటి డైలాగులు యువతను బాగా ఆకట్టుకుంటున్నాయి. తెలంగాణ అర్బన్ నేపథ్యంలో సాగే ఈ స్వచ్ఛమైన మరియు ఇంటెన్స్ లవ్ స్టోరీలో హర్షిత్ రెడ్డి తన నటనతో మరియు డైలాగ్ డెలివరీతో ఆకట్టుకున్నాడు. ఈ సినిమాకు శ్రీకాంత్ సంగిశెట్టి దర్శకత్వం వహించగా.. అర్హ మీడియా, వీ స్టూడియోస్ బ్యానర్స్‌లపై వాసుదేవ్ కొప్పినేని, శ్రీదేవి కార్యంపూడి సంయుక్తంగా నిర్మిస్తున్నారు. సమ్మర్ కానుకగా ఏప్రిల్ 14న ఈ చిత్రం రాబోతుండగా.. ప్రముఖ నిర్మాణ సంస్థ గీతా ఆర్ట్స్ ఈ మూవీని డిస్ట్రిబ్యూషన్ చేస్తుం

# ఉస్తాద్ ప్రచారంలో బిజీగా హరీష్ శంకర్

ప్రస్తుతం హరీశ్ శంకర్ 'ఉస్తాద్ భగత్ సింగ్' కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. పవన్ కల్యాణ్ హీరోగా తెరకెక్కిన ఈ చిత్రం మార్చి 19న భారీస్థాయిలో విడుదలకు సిద్ధమవుతోంది. దీనిప్రచారంలో భాగంగా దర్శకుడు వరుస ఇంటర్వ్యూలతో బిజీగా ఉన్నారు. తాజాగా ఆయన మాట్లాడుతూ ఈ సినిమా ప్రీలుక్ పోస్టర్ విడుదలైనప్పుడు వచ్చిన రూమర్స్‌పై స్పందించారు. ప్రీలుక్ పోస్టర్‌లో హీరో వెనక నుంచి తీసిన ఫొటో ఉండటంతో అందులో ఉన్నది పవన్ కల్యాణ్ కాదు, హరీశ్ శంకరే స్వయంగా డూప్‌గా నటించారనే వార్తలు వైరల్ అయ్యాయి. టీజర్ విడుదలైన తర్వాత కూడా కొందరు ప్రేక్షకులు ఆయనే డూప్‌గా నటించారని అన్నారు. దీనిపై ఆయన మాట్లాడుతూ.. తాను పవన్ కల్యాణ్‌కు ఎప్పుడూ డూప్‌గా నటించలేదని స్పష్టం చేశారు. ఆ రూమర్లు చూసి తాను బాధ పడలేదని, పవన్‌తో తనను పోల్చడం, తాను ఒక స్టార్ హీరోలా కనిపిస్తున్నానని జనం అనుకోవడం తనకు సంతోషాన్నిచ్చిందని సరదాగా అన్నారు. చిత్ర పరిశ్రమలో బాడీ డూప్‌ను ఎందుకు ఉపయోగిస్తారనే విషయంపై కూడా హరీశ్ శంకర్ వివరణ ఇచ్చారు. షూటింగ్ సమయంలో హీరోలకు చిన్న గాయం తగిలినా షూటింగ్ షెడ్యూల్స్ మొత్తం అస్తవ్యస్తమవుతాయని, దీనివల్ల నిర్మాతలకు కోట్ల రూపాయల నష్టం వస్తుందని ఆయన తెలిపారు. అందుకే హీరోల భద్రతను దృష్టిలోఉంచుకుని, రిస్క్ ఎక్కువగా ఉండే సన్నివేశాల్లోనే డూప్స్‌ను వాడతారని ఆయన వివరించారు.

# ఎనిమిదేళ్లుగా వేధిస్తున్నారు.. నేనేంటో చూపిస్తా : రష్మిక మందన్న!

నేషనల్ క్రష్ రష్మిక మందన్న సాధారణంగా చాలా కూల్‌గా కనిపిస్తారు. కానీ, గత కొంతకాలంగా తనపై జరుగుతున్న అసత్య ప్రచారాలు, వ్యక్తిగత దూషణలపై ఆమె సహనం నశించింది. గత ఎనిమిదేళ్లుగా తనను వేధిస్తున్నారని, ఇప్పుడు అది హద్దులు దాటి తన కుటుంబం వరకు వెళ్లిందని రష్మిక ఆవేదన వ్యక్తం చేశారు. ఇకపై మౌనంగా ఉండేది లేదని, తనను వేధిస్తున్న వారికి చట్టపరంగా బుద్ధి చెబుతానని ఎక్స్ వేదికగా గట్టి వార్నింగ్ ఇచ్చారు. ఆ వివరాలు ఇలా వున్నాయి .. గత 8 ఏళ్లుగా తన గురించి తప్పుడు ప్రచారాలు చేస్తూ, ఆన్‌లైన్‌లో వ్యక్తిగతంగా అటాక్ చేస్తున్నారని రష్మిక వాపోయారు.ఇక ముఖ్యంగా గత 24 గంటల్లో ఈ వేధింపులు మితిమీరిపోయాయని, తన ఫ్యామిలీని కూడా ఈ వివాదాల్లోకి లాగడంపై ఆమె తీవ్రంగా స్పందించారు. “ఇకపై ఊరుకునేది లేదు.. 24 గంటల్లో నాపై పెట్టిన ఆ అసభ్యకరమైన కంటెంట్‌ను తొలగించకపోతే పరువు నష్టం దావా వేస్తాను” అంటూ నేరుగా హెచ్చరించారు. తన సహనాన్ని పరీక్షించవద్దని, స్టాఫ్ కాలనీ లేదంటే చట్టపరంగా తాను చేయాల్సింది చేస్తానని ఆమె స్పష్టం చేశారు. రష్మిక ఇంతలా రియాక్ట్ అవ్వడానికి ప్రధాన కారణం, ఆమె గతంలో రక్షిత్ శెట్టితో చేసుకున్న ఎంగేజ్మెంట్ రద్దు విషయంపై మళ్ళీ తప్పుడు వార్తలు రావడం అని తెలుస్తోంది. ఇక ఎప్పుడో ముగిసిపోయిన విషయాన్ని పదే పదే గుర్తు చేస్తూ, తన క్యారెక్టర్‌ను కించపరిచేలా సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్న వారిపై ఆమె విరుచుకుపడ్డారు. ఒక నటిగా విమర్శలను స్వీకరిస్తాను కానీ, వ్యక్తిగత జీవితంపై దాడి చేస్తే మాత్రం చూస్తూ ఊరుకోనని ఆమె వెల్లడించారు. ఈ విషయంలో రష్మికకు అభిమానుల నుండి పెద్ద ఎత్తున మద్దతు లభిస్తోంది.





# నేను చెత్తలో ఉండటానికి ఇష్టపడలేదు

కోలీవుడ్ మూవీతో సినిమా ఇండస్ట్రీలో అడుగు పెట్టి, బాలీవుడ్‌లో టాప్ స్టార్ హీరోయిన్‌గా తనకంటూ ప్రత్యేక గుర్తింపు దక్కించుకుని, అటు నుంచి హాలీవుడ్ వెళ్లి అక్కడ స్టార్‌డం దక్కించుకున్న ముద్దుగుమ్మ ప్రియాంక చోప్రా. ఇండస్ట్రీలో అడుగు పెట్టి దశాబ్దాలు గడుస్తున్నా ఇప్పటికీ స్టార్‌డంతో టాప్ పొజీషన్‌లో ప్రియాంక చోప్రా కెరీర్ కొనసాగిస్తోంది. అప్పుడప్పుడు ఆమె వ్యక్తిగత విషయాల కారణంగా వార్తల్లో నిలుస్తున్న ప్రియాంక చోప్రా చాలా కాలం తర్వాత ఇండియన్ సినిమాల్లో తిరిగి నటిస్తోంది. ముఖ్యంగా ఈమె మహేష్ బాబు, రాజమౌళి కాంబోలో రూపొందుతున్న ‘వారణాసి’ సినిమాలో హీరోయిన్‌గా నటిస్తున్న విషయం తెల్సిందే. ఆ సినిమాతో పాటు మరో రెండు హిందీ సినిమాల్లోనూ ఈమె నటించేందుకు ఓకే చెప్పిందనే వార్తలు వస్తున్నాయి. మరో వైపు హాలీవుడ్ సినిమాలు, వెబ్ సిరీస్‌ల్లోనూ ఈమె వరుసగా నటిస్తూ బిజీబిజీగా ఉంది. తాజాగా ప్రియాంక చోప్రా ఒక ఇంటర్వ్యూలో బాలీవుడ్ గురించి చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదం అవుతున్నాయి. గతంలో కూడా బాలీవుడ్‌లో ఉన్న పరిస్థితుల గురించి ఈమె మాట్లాడుతూ అసహనం వ్యక్తం చేసిన విషయం తెల్సిందే. ఇప్పుడు ఏకంగా బాలీవుడ్‌ను చెత్త అంటూ సంబోధించడంతో చర్చనీయాంశం అయింది. బాలీవుడ్ వదిలి హాలీవుడ్‌లో ఎక్కువ ప్రాజెక్ట్‌లు చేయడానికి గల కారణం ఏంటి అని ప్రశ్నించిన సమయంలో ఆమె నుంచి వచ్చిన సమాధానం షాకింగ్‌గా ఉంది. బాలీవుడ్ సినిమాలతో స్టార్‌డం దక్కించుకున్న ప్రియాంక చోప్రా ఇప్పుడు బాలీవుడ్‌ను తీవ్ర స్థాయిలో విమర్శించడంను చాలా మంది తప్పుబడుతున్నారు. ప్రియాంక చోప్రా తీరు కచ్చితంగా హర్షనీయం కాదంటూ ఆమెను విమర్శిస్తున్న వారు చాలా మంది ఉన్నారు. బాలీవుడ్‌ను చెత్తతో పోల్చడంను ఇప్పుడు అంతా వ్యతిరేకిస్తూ ఆమెకి వ్యతిరేకంగా సోషల్ మీడియా పోస్ట్‌లు పెడుతున్నారు. సదరు ఇంటర్వ్యూలో ప్రియాంక చోప్రా మాట్లాడుతూ... బాలీవుడ్‌లో రాజకీయాలు తనకు అసౌకర్యంగా అనిపించేవి. తాను చెత్తలో ఉండాలని ఎప్పుడూ అనుకోను, ఎందుకంటే ఆ చెత్త వాసన వల్ల మనము పాడై పోతాము. పైగా ఆ వాసనకు అలవాటు పడి పోయి, అటు వైపు ప్రయాణం సాగించే ప్రమాదం ఉంది. అందుకే అలాంటి చెత్త నుంచి బయట పడాలని అనుకున్నాను. అందుకే దూరంగా ఉన్నాను అంటూ బాలీవుడ్ సినిమాల గురించి చెప్పుకొచ్చింది. తనకు నచ్చని పరిస్థితుల్లో ఎక్కువ కాలం కొనసాగడం చాలా ఇబ్బందిగా అనిపించింది. అందుకే తాను అందులోనుంచి బయట పడాలి అనుకున్న సమయంలో అనూహ్యంగా హాలీవుడ్‌లో ఆఫర్లు దక్కాయి. అక్కడ నుంచి వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకోవడం ద్వారా సక్సెస్ అయ్యాను అంటూ చెప్పుకొచ్చింది. పీసీ వ్యాఖ్యలపై బాలీవుడ్ వర్గాల వారు ఎలా స్పందిస్తారు అనేది చూడాలి.

# మేదర సంఘానికి ఐదు గుంటల భూమి కేటాయించాలి

**అఖిలపక్ష నాయకులు**



హుస్నాబాద్,జనత న్యూస్: హుస్నాబాద్ పట్టణంలోని శివాజీ నగర్‌లో ఉన్న బురుజు స్థలంలో మేదర సంఘం కమిటీ హాల్ నిర్మాణానికి రూ.40 లక్షల నిధులు మంజూరైనట్లు సమాచారం. అయితే అక్కడ స్థలం ఇరుకుగా ఉండటంతో పాటు మైసమ్మ తల్లి, పోచమ్మ తల్లి, ఎల్లమ్మ తల్లి దేవస్థానాలు ఉండటంతో ప్రతి సంవత్సరం దసరా సందర్భంగా జరిగే జంతుబలి కార్యక్రమాలకు ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందని అఖిలపక్ష నాయకులు పేర్కొన్నారు. అందువల్ల హుస్నాబాద్ పట్టణ పరిధిలోనే మేదర సంఘానికి ఐదు గుంటల భూమి కేటాయించి అక్కడ కమిటీ హాల్ నిర్మించుకునేలా చర్యలు తీసుకోవాలని మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్‌ను కోరారు. పట్టణ సంప్రదాయాలకు భంగం కలిగితే అన్ని పార్టీలతో కలిసి పెద్దఎత్తున కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు అయిలేని శంకర్ రెడ్డి, బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జి పచ్చిమట్ల రవీందర్ గౌడ్, రైతు సంఘం నాయకుడు కవ్వ వేణుగోపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధి హామీ కార్మికులకు పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలి



కరీంనగర్: ఉపాధి హామీ కార్మికుల చెమటకు గౌరవం ఇవ్వాలని, పెండింగ్‌లో ఉన్న వేతనాలను వెంటనే చెల్లించాలని భారతీయ మజ్దూర్ సంఘ్ జిల్లా కార్యదర్శి తొర్తి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. కరీంనగర్ రూరల్ మండలంలోని చామనపల్లి గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఆయన సందర్శించి కార్మికుల సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ పేదల జీవనోపాధికి గ్రామీణ ఉపాధి హామీ చట్టం బలమైన ఆధారమని తెలిపారు. ఈ చట్టం ప్రకారం ప్రతి గ్రామీణ కుటుంబానికి సంవత్సరానికి 125 రోజుల ఉపాధి కల్పించాలని ప్రభుత్వం నిర్ణయించిందని పేర్కొన్నారు. ఈ పథకం ద్వారా లక్షలాది మంది పేద కుటుంబాలు జీవనం సాగిస్తున్నప్పటికీ ప్రస్తుతం కార్మికులు అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారని అన్నారు. పని చేసిన తరువాత కూడా వేతనాలు నెలల తరబడి రావడం లేదని, ఇది కార్మికులను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తోందని తెలిపారు. పని ప్రదేశాల్లో తాగునీరు, నీడ, విశ్రాంతి స్థలం, ప్రథమ చికిత్స వంటి మౌలిక సౌకర్యాలు కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి నిధులు సమయానికి విడుదల కాకపోవడం వల్ల పనులు కూడా నిలిచిపోతున్నాయని అన్నారు. ఫేస్ గుర్తింపు విధానం కోసం పని ముందు, తర్వాత ఫోటోలు తీసి అప్‌లోడ్ చేయడంలో సిగ్నల్, సాఫ్ట్‌వేర్ సమస్యలు తలెత్తుతున్నాయని కార్మికులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఎండలు తీవ్రంగా ఉన్న నేపథ్యంలో కార్మికులకు వేసవి భత్యం కూడా కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రతి కుటుంబానికి 125 రోజుల ఉపాధి కల్పించే లక్ష్యంతో ప్రభుత్వం అవసరమైన బడ్జెట్‌ను కేటాయించాలని, ఈ అంశంపై కేంద్ర మంత్రులు, పార్లమెంట్ సభ్యులు చర్చించి కార్మికులకు అనుకూల నిర్ణయాలు తీసుకోవాలని తొర్తి శ్రీనివాస్ కోరారు.

# హుస్నాబాద్‌లో కోతుల దాడి.. బైక్‌దారుడికి గాయాలు

**పట్టణంలో పెరుగుతున్న కోతుల సంచారం**

**చర్యలు తీసుకోవాలని ప్రజల డిమాండ్**





హుస్నాబాద్,జనత న్యూస్: పట్టణంలో కోతుల బెడద రోజురోజుకూ పెరుగుతోంది. గురువారం రెడ్డి కాలనిలోని రిలయన్స్ టవర్ సమీపంలో బైక్‌పై వెళ్తున్న వ్యక్తిపై కోతుల గుంపు దాడి చేసింది. ఒక్కసారిగా కోతులు విరుచుకుపడటంతో అతడు బైక్‌పై నుంచి పడిపోయి గాయపడ్డాడు. కోతులు కరవడంతో అతనికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు కోతులను తరిమికొట్టి గాయపడిన వ్యక్తిని ఆస్పత్రికి తరలించారు. ఇటీవలి కాలంలో పట్టణంలో కోతుల సంచారం ఎక్కువైందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇళ్లలోకి చొరబడి ఆహార పదార్థాలు ఎత్తుకెళ్లడం, అడ్డొచ్చిన వారిపై దాడులు చేయడం పెరిగిందని చెబుతున్నారు. ముఖ్యంగా పిల్లలు, వృద్ధులు బయటకు రావాలంటే భయపడుతున్నారని అంటున్నారు. కోతుల సమస్యపై పలుమార్లు ఫిర్యాదు చేసినా అధికారులు స్పందించడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వెంటనే చర్యలు తీసుకుని కోతులను పట్టుకుని తరలించాలని ప్రజలు కోరుతున్నారు.

# నూతన కార్పొరేటర్లు, కౌన్సిలర్లకు ప్రత్యేక శిక్షణ




కరీంనగర్: కరీంనగర్ కలెక్టరేట్ ఆడిటోరియంలో గురువారం నూతనంగా ఎన్నికైన నగరపాలక సంస్థ కార్పొరేటర్లు, చొప్పదండి, జమ్మికుంట, హుజూరాబాద్ మున్సిపల్ కౌన్సిలర్లకు ప్రత్యేక శిక్షణ తరగతులు, అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రజా పాలన--ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా జిల్లా పరిపాలన ఆధ్వర్యంలో, కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ సమక్షంలో జరిగిన ఈ కార్యక్రమంలో నగర మేయర్ కొలగాని శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా, డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్ రావు, సుడా చైర్మన్ నరేందర్ రెడ్డి పాల్గొన్నారు. మున్సిపల్ 2019 చట్టం, మున్సిపల్ విభాగాల పనితీరు, ఆదాయ వనరుల పెంపు, నిధుల వినియోగం, ప్రభుత్వ పథకాల అమలు వంటి అంశాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సమగ్ర అవగాహన కల్పించారు. ప్రజాప్రతినిధులుగా కార్పొరేటర్లు, కౌన్సిలర్ల విధులు, పట్టణాల అభివృద్ధిలో వారి పాత్రపై మార్గనిర్దేశం చేశారు. పౌర సేవలు, పారదర్శకత, జవాబుదారితనం, అవినీతి రహిత పాలన, పారిశుధ్య నిర్వహణ, ప్రజా సమస్యల పరిష్కారం వంటి అంశాలపై సూచనలు చేశారు. మేయర్ కొలగాని శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రజల నమ్మకాన్ని నిలబెట్టే విధంగా పాలకవర్గ సభ్యులు డివిజన్ల అభివృద్ధిలో ముందుండాలని అన్నారు. పారిశుధ్యం, త్రాగునీటి సరఫరా, మౌలిక వసతులపై ప్రత్యేక దృష్టి సారిస్తామని తెలిపారు. ప్రజా పాలన--ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా డివిజన్ల వారీగా పారిశుధ్య పనులు, అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామని చెప్పారు. జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా మాట్లాడుతూ నూతనంగా ఎన్నికైన కార్పొరేటర్లు, కౌన్సిలర్లు మున్సిపల్ చట్టంపై పూర్తి అవగాహన పెంచుకోవాలని సూచించారు. ప్రభుత్వ నిధులను పారదర్శకంగా వినియోగిస్తూ పట్టణాల అభివృద్ధికి కృషి చేయాలని అన్నారు. డ్రైనేజీ, త్రాగునీరు, వీధి దీపాలు వంటి సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ మాట్లాడుతూ నగరపాలక సంస్థలో జరుగుతున్న అభివృద్ధి పనులు, పన్నుల వసూళ్లు, పారిశుధ్య నిర్వహణ వంటి అంశాలపై వివరించారు. మెరుగైన పౌర సేవలు అందించేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని కోరారు. సుడా చైర్మన్ నరేందర్ రెడ్డి మాట్లాడుతూ ప్రజల ముంగిటకే పాలనను తీసుకెళ్లడం ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. ప్రజా పాలన--ప్రగతి ప్రణాళికలో భాగంగా డివిజన్లలో పారిశుధ్యం, త్రాగునీటి సరఫరా, వీధి దీపాల నిర్వహణ వంటి సమస్యలను పరిష్కరించేందుకు ప్రజాప్రతినిధులు కృషి చేయాలని పిలుపునిచ్చారు. డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్ రావు మాట్లాడుతూ వార్డుల్లో చిన్న సమస్యలను కూడా నిర్లక్ష్యం చేయకుండా అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో చొప్పదండి, హుజూరాబాద్, జమ్మికుంట మున్సిపల్ చైర్‌పర్సన్‌లు, వైస్ చైర్మన్‌లు, అధికారులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వ లక్ష్యం

**ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక ను సద్వినిగం చేసుకోండి**

**సర్పంచుల అవగాహన సదస్సులో జిల్లా కలెక్టర్ చిత్రమిశ్రా, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం**



తిమ్మాపూర్, జనతా న్యూస్ : ప్రజా సమస్యలను త్వరగా పరిష్కరించేందుకే రాష్ట్ర ప్రభుత్వం 'ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక' కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని చొప్పదండి ఎమ్మెల్యే, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు మేడిపల్లి సత్యం అన్నారు. కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండల కేంద్రంలోని శ్రీ చైతన్య ఇంజనీరింగ్ కళాశాల ఆడిటోరియంలో నిర్వహించిన ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక' లో భాగంగా 99 రోజుల కార్యాచరణ ప్రణాళిక పై నూతన సర్పంచుల శిక్షణ కార్యక్రమానికి కలెక్టర్ చిత్రా మిశ్రా, సుడా చైర్మన్ నరేందర్ రెడ్డి తో కలిసి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు సర్పంచులను ఉద్దేశించి మాట్లాడుతూ.. రెండేళ్ల పాలన పూర్తయిన సందర్భంగా ప్రత్యేక కార్యక్రమానికి సీఎం రేవంత్ రెడ్డి ప్లాన్ చేశారన్నారు. సర్పంచుల పనితీరుతోనే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల లక్ష్యం నెరవేరుతుందనీ, సర్పంచులు ఆ దిశగా కృషి చేయాలని సూచించారు. 73వ రాజ్యంగా సవరణ ద్వారా సర్పంచులకు విశేషమైన అధికారులు కట్టబెట్టిందన్న విషయాన్ని గుర్తు చేస్తూ, గ్రామ ప్రజలు గొప్పగా చెప్పుకునేలా సర్పంచులు పనిచేయాలని పిలుపునిచ్చారు. అంతకుముందు సుడా చైర్మన్ మాట్లాడుతూ.. గ్రామాల్లో మౌలిక వసతులు కల్పిస్తూ అభివృద్ధికి కృషి చేస్తున్నామని చెప్పారు. 99రోజుల కార్యాచరణను ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకొని, ఒక పక్కా ప్రణాళికతో పనిచేసి గ్రామాన్ని అభివృద్ధి చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ లక్ష్మీ కిరణ్, ఆర్డీవో మహేశ్వర్, డిపిఓ జగదీశ్వర్, డిఆర్డిఓ శ్రీధర్, తాసిల్దార్, ఎంపీడీవోలు ఎంపీఓలు, నూతన సర్పంచులు పాల్గొన్నారు.

# మార్కెట్ యార్డులో శ్రమదానం చేసిన చైర్మన్ కంది తిరుపతి రెడ్డి

హుస్నాబాద్,జనత న్యూస్: పట్టణంలో చేపడుతున్న 'ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక' కార్యక్రమంలో భాగంగా మున్సిపల్ అధికారుల ఆదేశాలతో స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులో గురువారం ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమం నిర్వహించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ దండి లక్ష్మి, కమిషనర్ మల్లికార్జున్ సూచనల మేరకు శానిటరీ ఇన్‌స్పెక్టర్ బాల ఎల్లం ఆధ్వర్యంలో ఈ క్లీన్ డ్రైవ్ చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కంది తిరుపతి రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మున్సిపల్ సిబ్బంది, మెప్మా రిసోర్స్ పర్సన్లతో కలిసి మార్కెట్ ప్రాంగణాన్ని శుభ్రపరిచారు. యార్డులో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని సేకరించి ట్రాక్టర్ల ద్వారా డంప్ యార్డుకు తరలించారు. పట్టణాన్ని స్వచ్ఛంగా తీర్చిదిద్దేందుకు ప్రజలు సహకరించాలని, పారిశుద్ధ్యానికి అధిక ప్రాధాన్యం ఇవ్వాలని అయన కోరారు. ఈ కార్యక్రమంలో మెప్మా ఏడీఎంసీ సంతోషి మాత, పర్యావరణ అధికారి రవికుమార్, జవాన్లు సారయ్య, ప్రభాకర్, మెప్మా రిసోర్స్ పర్సన్లు, శానిటేషన్ సిబ్బంది పాల్గొన్నారు.




# కవ్వంపల్లి పదవీ స్వీకారోత్సవానికి తరలిన కాంగ్రెస్ శ్రేణులు



తిమ్మాపూర్, జనతా న్యూస్ : హైదరాబాద్ లోని గాంధీ భవన్ లో తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ(టీపీసీసీ) ఎస్సీ సెల్ చైర్మన్ గా మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ పదవీ స్వీకారోత్సవానికి గురువారం కరీంనగర్ జిల్లా నలుమూలల నుంచి పార్టీశ్రేణులు తరలి వెళ్లారు. ముఖ్యంగా మానకొండూర్ నియోజకవర్గం పరిధిలోని మండలాల నుంచి పార్టీ నాయకులు, ఎస్సీ సామాజికవర్గానికి చెందిన నాయకులు, కార్యకర్తలు బస్సులు, వ్యాన్లు, కార్లు ఇతర వాహనాల్లో భారీగా తరలి వెళ్లి కవ్వంపల్లి పట్ల తమ అభిమానాన్ని చాటుకున్నారు. తిమ్మాపూర్ మండలం నుండి మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బండారి రమేష్ ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు వాహనాల్లో భారీగా హైదరాబాద్ తరలి వెళ్లారు. వారిలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సుధగోని లక్ష్మీనారాయణ గౌడ్, పార్టీ నాయకులు గోపు మల్లారెడ్డి, కంది లక్ష్మి నారాయణ రెడ్డి, మోరపల్లి రమణారెడ్డి, శ్రీగిరి రంగారావు, తుమ్మనపల్లి శ్రీనివాసరావు, కుంట రాజేందర్ రెడ్డి, గోగూరి నరసింహారెడ్డి, మామిడి అనిల్ కుమార్, గంకిడి లక్ష్మారెడ్డి, చింతల లక్ష్మారెడ్డి, పొన్నాల సంపత్, రవి, బుదారపు శ్రీనివాస్, కంది అశోక్ రెడ్డి, గొట్టుముక్కల సంపత్ రెడ్డి, ముప్పిడి సంపత్ రెడ్డి, పెరుక రవీందర్, అసోది శ్రీనివాస్,మోహన్, ఎలక రాజు, తమ్మనవేని రాములు గౌడ్, రెడ్డి రాజు, దుర్గం తిరుపతి, జింక మారుతి, బి సంతోష్, ఉప్పులేటి రాజు, ఎం. అనిల్ తదితరులు ఉన్నారు.

# నారసింహుడి సేవలో గవర్నర్ శివ్ ప్రతాప్ శుక్లా

**పూర్ణకుంభ స్వాగతం పలికిన అర్చకులు..**
**లడ్డూప్రసాదం అందజేసిన ఈవో, చైర్మన్**
**గర్భగుడిలో నారసింహుడిని దర్శించుకుని**
**శివాలయంలో రామలింగేశ్వరుడికి ప్రత్యేక పూజలు**
**యాదగిరిగుట్టలో మూడు గంటలు గడిపిన గవర్నర్**



యాదగిరిగుట్ట : యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామిని రాష్ట్ర గవర్నర్ శివప్రతాప్ శుక్లా గురువారం దర్శించుకున్నారు. ఫ్యామిలీతో కలిసి గర్భగుడిలో స్వయంభూ నారసింహుడిని దర్శించుకుని ముఖ మంటపంలో స్వామివారి ఉత్సవమూర్తులకు అష్టోత్తర పూజలు చేశారు. హైదరాబాద్ లోక్ భవన్ నుండి ఉదయం 11:00 గంటలకు రోడ్డు మార్గంలో బయలుదేరి మధ్యాహ్నం 12:20 గంటల వరకు యాదగిరిగుట్టకు చేరుకున్నారు. మధ్యాహ్నం 12:20 గంటలకు యాదగిరిగుట్ట చేరుకున్న గవర్నర్.. మధ్యాహ్నం 03:20 గంటల వరకు దాదాపుగా మూడు గంటల పాటు యాదగిరిగుట్టలో గడిపారు. యాదగిరిగుట్టకు వచ్చిన గవర్నర్.. మొదట నేరుగా ప్రెసిడెన్షియల్ సూట్ కు వెళ్లి ఫ్రెష్ అయ్యారు. అనంతరం కొండపైకి చేరుకున్న గవర్నర్ కు ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య ఫ్లవర్ బొకే ఇచ్చి వెల్కమ్ చెప్పారు. జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి మొక్కను బహూకరించి స్వాగతం పలికారు. పోలీసుల గౌరవ వందనం స్వీకరించిన అనంతరం లిఫ్ట్ ద్వారా ప్రధానాలయ ప్రాంగణానికి చేరుకున్న గవర్నర్ కు.. ఆలయ ఈవో భవానీ శంకర్ ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. లిఫ్ట్ ద్వారా ప్రధానాలయ ప్రాంగణానికి చేరుకుని దేవస్థానానికి సంబంధించిన బ్యాటరీ వాహనంలో తూర్పు రాజగోపురం వరకు వెళ్లారు. అనంతరం తూర్పు రాజగోపురం వద్ద గవర్నర్ కు ఆలయ ప్రధానార్చకులు కాండూరి వెంకటాచార్యులు, సురేంద్రాచార్యుల అర్చకత్వంలో అర్చకులు పూర్ణకుంభ స్వాగతం పలికారు. అనంతరం ఉత్తర అంతర ప్రాకార మండపంలోని లిఫ్ట్ ద్వారా ప్రధానాలయంలోకి వెళ్లారు. మొదట గర్భాలయానికి అభిముఖంగా ఉన్న స్వర్ణ ధ్వజస్తంభానికి మొక్కి గర్భగుడిలోకి వెళ్లారు. దాదాపుగా 15 నిమిషాల పాటు గర్భగుడిలో స్వయంభూ నారసింహుడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ప్రధానాలయ ముఖ మంటపంలో స్వామివారి ఉత్సవమూర్తులకు అష్టోత్తర పూజలు చేశారు. దర్శనం అనంతరం ప్రధానాలయ ముఖ మంటపంలో అర్చకులు, వేదపండితులు ఆయనకు చతుర్వేద ఆశీర్వచనం చేయగా.. ఆలయ చైర్మన్ నర్సింహమూర్తి, ఈవో భవానీ శంకర్ లడ్డూప్రసాదం, స్వామివారి శేషవస్త్రాలు అందజేసి నారసింహుడి ఫొటోను బహూకరించారు. అనంతరం పశ్చిమ రాజగోపురం నుండి ఆలయం నుండి బయటకు వచ్చారు.



### శివాలయంలో స్పటిక లింగానికి పంచామృతాభిషేకం చేసిన గవర్నర్

నారసింహుడి ప్రధానాలయ పశ్చిమ రాజగోపురం నుండి ఆలయం నుండి వెలుపలికి వచ్చిన గవర్నర్ శివ్ ప్రతాప్ శుక్లా.. బ్యాటరీ వాహనంలో కొండపైనే ఉన్న శివాలయానికి చేరుకున్నారు. శివాలయంలో పర్వతవర్ధినీ సమేత రామలింగేశ్వరస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. మొదట నందీశ్వరుడు, ధ్వజస్తంభానికి మొక్కి శివాలయంలోకి వెళ్లిన గవర్నర్.. ముఖ మంటపంలో ఉన్న స్పటిక లింగమూర్తికి పంచామృతాభిషేకం చేశారు. అనంతరం గర్భగుడిలో స్వయంభూ రామలింగేశ్వరుడికి 15 నిమిషాల పాటు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం బ్యాటరీ వెహికిల్ లో ఈవో క్యాంప్ ఆఫీస్ కు వెళ్లి ఫ్యామిలీతో కలిసి లంచ్ చేశారు. అనంతరం మధ్యాహ్నం 2:20 గంటలకు కొండపై నుండి రోడ్డు మార్గంలో ప్రెసిడెన్షియల్ సూట్ కు వెళ్లారు. సూట్ లో కాసేపు రెస్ట్ తీసుకున్న గవర్నర్.. మధ్యాహ్నం 3:20 గంటలకు రోడ్డు మార్గంలో కాన్వాయ్ ద్వారా హైదరాబాద్ లోక్ భవన్ కు వెళ్లిపోయారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ అనురాగ్ జయంతితో పాటు ఆలయ ఈవో భవానీ శంకర్, ఆలయ చైర్మన్ నర్సింహమూర్తి, జిల్లా ఎస్పీ అక్షాంశ్ యాదవ్, డీఎస్పీ శ్రీనివాస్ నాయుడు తదితరులు ఉన్నారు.

# గ్యాస్ కొరతతో హోటళ్లు మూత

**హాస్టళ్ల పరిస్థితి మరింత దారుణం**
**ఆర్టీసీ క్రాస్‌రోడ్ బావర్చి మూసివేత**
**ప్యారడైజ్ హోటల్ కూడా అదే దుస్థితి**
**బ్లాక్ విక్రయాలపై కఠిన చర్యలు తప్పవన్న అధికారులు**




**హైదరాబాద్,మార్చి12 :** వంటగ్యాస్ కొరత హోటల్ పరిశ్రమను అతలాకుతలం చేస్తోంది. ఇక్కడ హాస్టళ్లో ఉంటూ చదువుకుంటున్న వారు తీవ్ర ఇబ్బందులకు గురయ్యే దుర్భర పరిస్థితి నెలకొంది. అలాగే హోటల పరిశ్రమపై ఆధారపడ్డ నిరుద్యోగులు కూడా ఆందోళన చెందుతున్నారు. మహానగరంలో కమర్షియల్ గ్యాస్ సిలిండర్ల సరఫరా నిలిచిపోయింది. వంటగ్యాస్ సిలిండర్ల సమస్య పరిష్కారానికి ఉన్నతాధికారులు చర్యలు చేపట్టారని జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి కె. శ్రీనివాస్ తెలిపారు. సిలిండర్లను అధిక ధరకు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయిల్ కంపెనీలకు ఆదేశాలు జారీ చేశామని, ప్రజలు ఆందోళన చెందవద్దన్నారు. నెలకు ఒక సిలిండర్ బుకింగ్ చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. పశ్చిమాసియా యుద్ధం పీజీ యజమానుల గుండెల్లో గుబులు పుట్టిస్తోంది. ఓవైపు గ్యాస్ కొరతతో నగరంలోని పలు హోటళ్లను తాత్కాలికంగా మూసేస్తుంటే, మరోవైపు హాస్టళ్ల నిర్వహణపై యజమానులు మల్లగుల్లాలుపడుతున్నారు. కమర్షియల్ ఎల్‌పీజీ సిలిండర్ల సరఫరా బుధవారం నుంచి నగరంలో దాదాపుగా ఆగిపోవడంతో హాస్టళ్ల నిర్వహణ కష్టంగా మారింది. గ్యాస్ వినియోగం ఎక్కువ అయ్యే దోసె, పూరీ, చపాతీ వంటకాలను తాత్కాలికంగా అన్ని హాస్టళ్లలో నిలిపివేసినట్లు సమాచారం. గ్యాస్ కొరత తీరేవరకు అన్నం, సాంబారు, కూరతో సాధారణ భోజనాన్ని మాత్రమే అందించగలమని ఐటీకారిడార్‌లోని హాస్టల్ అసోసియేషన్ ప్రతినిధులు బుధవారం ప్రకటించారు. చికెన్, కోడిగుడ్డుకూర, వేపుళ్లు వంటి అదనపు వంటలను నిలుపుదలచేస్తున్నట్లు తెలిపారు. టీ, కాఫీ లాంటివాటిని అందించలేమని వెల్లడిస్తున్నారు. గ్రేటర్ పరిధిలో మూడు, నాలుగు రోజులుగా సిలిండర్ల బుకింగ్ కావడం లేదని ప్రజలు వాపోతున్నారు. సర్వర్ డౌన్‌తో బుకింగ్ కావడం లేదంటున్నారు. వాట్సాప్ ద్వారా బుక్ చేసుకునే అవకాశం ఉన్నా కావడం లేదంటున్నారు. ఆర్టీసీ క్రాస్ రోడ్డులోని బావర్చి హోటల్‌ను బుధవారం మూసేశారు. గ్యాస్ సిలిండర్ల కొరత కారణంగానే మూసేసిన్నట్లుగా తెలిసింది. ప్రముఖ ప్యారడైజ్ హోటల్స్ అన్ని బ్రాంచీలలో టీ అమ్మకాలను నిలిపివేశారు. ఐటీసీ సంస్థ కూడా వివిధ ప్రాంతాల్లో గల సంస్థ హోటల్స్‌లో గ్యాస్ కొరత కారణంగా లంచ్, డిన్నర్ ఉండదని ప్రకటించింది. ఒకవేళ దొరికినా కొన్ని ప్రాంతాల్లో రూ. 4 వేలకు, మరికొన్ని ప్రాంతాల్లో రూ. 3,500కు విక్రయిస్తున్నారు. 19 కిలోల కమర్షియల్ గ్యాస్ సిలిండర్ ధర సాధారణంగా రూ. 2105ల వరకు ఉంది. బుధవారం నుంచి కమర్షియల్ సిలిండర్ల సరఫరా పూర్తిగా బంద్ అయింది. పాతబస్తీలోని పలు ప్రాంతాల్లో కూడా కమర్షియల్ గ్యాస్ సిలిండర్ల సరఫరాను నిలిపివేశారు. నగరంలోని పలు ప్రాంతాల్లో ఇదే తరహా పరిస్థితులు నెలకొన్నాయి. కమర్షియల్ గ్యాస్ సిలిండర్ల సరఫరా లేకపోవడం, మార్కెట్‌లో అధిక ధర ఉండడంతో కొనుగోలు చేయలేక పలు హోటల్స్ మూత పడుతున్నాయి. సిలిండర్ కొరతతో హోటల్స్ మూసేస్తున్నట్లు యజమానులు ప్రకటించారు. అవసరమైతే అవసరమైతే కట్టెల పొయ్యి మీద వంట చేస్తామని చెప్పారు. ఇక పలు ప్రాంతాల్లో టిఫిన్ సెంటర్‌లో కమర్షియల్ సిలిండర్ సరఫరా లేకపోవడంతో హోటల్ మూసివేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. టిఫిన్ సెంటర్ బందు చేసుకోవాల్సి వస్తదేమోనని ఆందోళన చెందారు. అఫ్జల్‌గంజ్, బేగంబజార్‌లో కొన్ని టిఫిన్ సెంటర్లలో గ్యాస్ లేకపోవడంతో మూసేస్తున్నారు. వేల రూపాయలు పెట్టి సిలిండర్ కొనుగోలు చేసి వ్యాపారం ఎలా చేస్తామని చిన్న హోటళ్లు, టిఫిన్ సెంటర్ల నిర్వాహకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్యాస్ కొరతతో పలు ప్రాంతాల్లో బిర్యానీ సెంటర్లు మూతపడ్డాయి. పలు ప్రాంతాల్లో వాణిజ్య అవసరాలకు డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్లను వినియోగిస్తున్నారు. కమర్షియల్ గ్యాస్ సిలిండర్లు దొరక్కపోవడంతో టీ షాపులు, బండి వ్యాపారులు, టిఫిన్ సెంటర్ల నిర్వహకులు డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్లను వాడుతున్నారు. కొందరూ గృహ వినియోగదారులు 14కిలోల గ్యాస్ సిలిండర్‌ను రూ. 1800ల వరకు అమ్ముతున్నారు. గ్యాస్ సిలిండర్ల కొరతతో హోటళ్లు మూతపడుతున్నాయి. గృహావసరాల సిలిండర్ల సరఫరా తగ్గింది. దీంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. అయితే రూ. 5 భోజనానికి ఇబ్బంది ఉండదని జీహెచ్‌ఎంసీ వర్గాలు చెబుతున్నాయి. విద్యుత్‌తో నడిచే యంత్రాలతో భోజనం తయారు చేస్తున్న దృష్ట్యా గ్యాస్ కొరత ప్రభావం తయారీపై ఉండబోదని జీహెచ్‌ఎంసీ అధికారి ఒకరు తెలిపారు. సిలిండర్లకు ప్రత్యామ్నాయ మర్గాలను నిర్వాహకులు ఆన్వేషిస్తున్నారని అమీర్‌పేట హాస్టళ్ల అసోసియేషన్ అధ్యక్షుడు రాజారావు చెబుతున్నారు. బుధవారం అమీర్‌పేట ప్రాంతంలోని హాస్టల్ నిర్వాహకులు 120కుపైగా ఎలక్ట్రికల్ స్టౌలు కొనుగోలు చేసినట్లు సమాచారం. కొందరు కట్టెల పొయ్యి ఏర్పాటుచేసుకున్నారని దుర్గానగర్ హాస్టళ్ల అసోసియేషన్ అధ్యక్షుడు రాజశేఖర్ చెప్పారు. గ్యాస్ కొరత నేపథ్యంలో హాస్టళ్ల యజమానులంతా ఒక్కటయ్యారు. నిర్వహణ విషయంలో తాత్కాలిక నిబంధనలు రూపొందించి అమలుచేస్తున్నారు.

విద్యా, ఉద్యోగ అవకాశాల కోసం నగరానికి వచ్చిన యువతకు ఆశ్రయమిచ్చే పేయింగ్ గెస్ట్ హాస్టళ్ల నిర్వహణ ఇప్పుడు మరింత భారంగా మారింది. మహారాష్ట్ర, ఒడిశా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుంచి కోర్సులు నేర్చుకోడానికి వచ్చే విద్యార్థుల సంఖ్య ఏడాదిగా బాగా తగ్గింది. దాంతో ప్రైవేటు హాస్టళ్ల వ్యాపారం మందకొండిగా నడుస్తోంది. గ్యాస్ కొరత మమ్మల్ని మరింత నష్టాల్లోకి నెడుతుంది. ప్రత్యామ్నాయ మార్గాలను వెతుకుతున్నాం. హాస్టల్‌లో ఉంటున్నవారికి అన్నం, కూర, సాంబారైనా వడ్డించడానికి ప్రత్నిస్తున్నాం అంటున్నారు.

# బండి సంజయ్ పాదయాత్రను విజయవంతం చేయండి



హుస్నాబాద్,జనత న్యూస్: కరీంనగర్ పార్లమెంట్ పరిధిలోని మున్సిపాలిటీ, సర్పంచ్ ఎన్నికల విజయోత్సవం సందర్భంగా కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ చేపట్టనున్న కొండగట్టు పాదయాత్రను విజయవంతం చేయాలని బీజేపీ హుస్నాబాద్ రూరల్ మండల అధ్యక్షుడు భూక్య సంపత్ నాయక్ పిలుపునిచ్చారు. గురువారం మండల కేంద్రంలో పార్టీ నాయకులు, కార్యకర్తలతో ఏర్పాటు చేసిన సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ఎన్నికల విజయం సందర్భంగా అంజన్నకు మొక్కు తీర్చుకుంటానని ఇచ్చిన మాట మేరకు, ఈ నెల 14వ తేదీ శనివారం ఉదయం 6 గంటలకు కరీంనగర్ శక్తిపీఠం నుండి కొండగట్టు వరకు బండి సంజయ్ పాదయాత్ర నిర్వహించనున్నట్లు ఆయన వెల్లడించారు. ఈ కార్యక్రమంలో పార్టీ శ్రేణులతో పాటు ప్రజలు కూడా భారీగా పాల్గొనాలని కోరారు. ప్రతి బూత్ నుండి కనీసం 20 మందికి తగ్గకుండా కార్యకర్తలు కరీంనగర్‌కు చేరుకోవాలని, ఈ మేరకు గ్రామ శక్తి కేంద్ర ఇన్చార్జిలు, బూత్ అధ్యక్షులు చురుకైన పాత్ర పోషించాలని సూచించారు. గెలిచిన మున్సిపల్ కౌన్సిలర్లు, సర్పంచ్‌లు, వార్డ్ మెంబర్లు, అభ్యర్థులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి అంజన్న స్వామిని దర్శించుకోవాలని నిర్ణయించారు. ఈ సన్నాహక సమావేశంలో భారతీయ జనతా పార్టీ మాజీ మండల అధ్యక్షుడు వెల్దండి రాజేంద్రప్రసాద్, సీనియర్ నాయకులు భూతగడ్డపు బాలరాజు, మంద మహేశ్వర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, రత్నాకర్ రెడ్డి, కన్నె శంకర్, నెల్లి శ్రీనివాస్, బూత్ అధ్యక్షులు కొలిపాక కిరణ్, బాలరాజు, బొల్లి సుధాకర్, గుగులోతు రాములు, బాసబత్తిని మధుసూదన్, రవీందర్ తదితర నాయకులు పాల్గొన్నారు.

# వంటగ్యాస్ కొరతను నివారించాలి

**హుస్నాబాద్ గ్యాస్ ఏజెన్సీ వద్ద బీఆర్ఎస్ నిరసన**



హుస్నాబాద్,జనత న్యూస్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకు వంటగ్యాస్ కొరత లేకుండా చూడాలని, అక్రమంగా సిలిండర్లను నిల్వ చేసి ఎక్కువ ధరలకు విక్రయించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ హుస్నాబాద్ నియోజకవర్గ అధికార ప్రతినిధి ఐలేని మల్లికార్జున్ రెడ్డి డిమాండ్ చేశారు. హుస్నాబాద్ పట్టణంలోని ఓ గ్యాస్ ఏజెన్సీ వద్ద గురువారం ఆయన ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా మల్లికార్జున్ రెడ్డి మాట్లాడుతూ.. అంతర్జాతీయంగా యుద్ధాలు జరుగుతున్న తరుణంలో సామాన్యులపై గ్యాస్ భారం పడకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వాలదేనన్నారు.

ప్రస్తుతం ఆన్‌లైన్‌లో గ్యాస్ బుకింగ్ చేస్తుంటే సర్వర్ సమస్యలతో గంటల తరబడి సమయం వృథా అవుతోందని, దీంతో వినియోగదారులు తీవ్ర ఆవేదన చెందుతున్నారని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం గ్యాస్ కొరత లేదని ప్రకటనలు చేస్తున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో బుకింగ్ కాక పట్టణ ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని విమర్శించారు. గృహ, వాణిజ్య అవసరాలకు గ్యాస్ అందకపోవడాన్ని ఆసరాగా తీసుకుని దళారులు ఎల్‌పీజీని బ్లాక్ మార్కెట్‌కు తరలించి అధిక ధరలకు అమ్ముతున్నారని ఆరోపించారు. అధికారులు స్పందించి అక్రమ విక్రయాలపై నిఘా పెంచాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ బొజ్జ హరీష్ తదితరులు పాల్గొన్నారు.

# వేతన బిల్లు మంజూరు లంచం

**ఎసిబికి చిక్కిన సీనియర్ అసిస్టెంట్**

**యాదాద్రి భువనగిరి :** ప్రభుత్వ ఉద్యోగికి రావలసిన వేతన బిల్లుల కోసం లంచం తీసుకున్న ట్రెజరరీ సీనియర్ అసిస్టెంట్‌ను ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూరు సబ్ ట్రెజరీ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ గా పనిచేస్తున్న ఎండీ ఖదీర్ విడదల వారిగా ఫోన్ పే ద్వారా రూ. 15 వేలు లంచం తీసుకున్నాడు. అధికారి అవినీతిపై బాధితుడు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశాడు. అనంతరం బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఖదీర్ ఇంటిపై ఏసీబీ అధికారులు గురువారం మోత్కూర్‌లోని ఎస్‌టీవో కార్యాలయంపై దాడులు చేసి సోదాలు నిర్వహించారు. 38 రోజులకు సంబంధించిన వేతనం రూ. 1,09,384 కోసం బాధితుడు అధికారులను సంప్రదించగా తొలి విడతగా ఖదీర్ స్నేహితుడు సీనియర్ అసిస్టెంట్ నిరంజన్ అకౌంట్‌లోకి రూ. 5 వేలు ట్రాన్స్‌ఫర్ చేయించాడు. చివరి రెండు విడతలు ఖదీర్‌కు ఫోన్ పే ద్వారా చెల్లించాడు. ఏసీబీ అధికారులు ఎస్‌టీవో సీనియర్ అసిస్టెంట్ ఖదీర్ ఫోన్‌ను స్వాధీనం చేసుకుని అరెస్టు చేసి హైదరాబాద్‌లోని ఏసీబీ కోర్టులో హాజరుపరిచారు.

# టెన్త్ విద్యార్థులకు ప్యాడ్లు, పెన్నులు పంపిణీ

**నల్లగొండ,మార్చి12 :** లయన్స్ క్లబ్ ఆఫ్ నల్లగొండ ఎలైట్ ఆధ్వర్యంలో అద్దంకి లక్ష్మమ్మ జ్ఞాపకార్థం వారి కుమారుడు అద్దంకి సునీల్ నల్లగొండ జిల్లా కేంద్రంలోని బాలికల వసతి గృహం ఏబీసీడీ క్యాంపస్ పదో తరగతి విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు, పెన్నులు గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా క్లబ్ నాయకులు మాట్లాడుతూ.. పదో తరగతిలో మంచి ఉత్తీర్ణత సాధించి ఉన్నత శిఖరాలకు ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ఆఫ్ నల్లగొండ ఎలైట్ సభ్యులు ఇంద్రారెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, కిరణ్, రామకృష్ణ, అద్దంకి సునీల్, నల్లగొండ ఏఎస్‌డబ్ల్యూఓ స్వామి, హెచ్‌డబ్ల్యూఓస్ విజయలక్ష్మి, స్వప్న, దూసరి భారతమ్మ, తయాబా పాల్గొన్నారు.

EDITED, PRINTED PUBLISHED AND OWNED BY YAMSANI SHIVA KUMAR, PRINTED AT SRI BALAJI PRINTING PRESS, H.NO : 4-4-85, KARIMNAGAR-504001 DISTRICT TELANGANA PUBLISHED AT H.NO:6-2-7A, HANMANWADA, JAGITYAL, VIL & MDL.DIST.KARIMNAGAR 506327 EDITOR : YAMSANI SHIVA KUMAR RNI NO: TELTEL/2014/55206, CELL NO: 79-89867251 Email: janathadaily@gmail.com